# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - గురువారం 10 జూలై 2025 | సంపుటి:9 | సంచిక:193 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM




## నమీబియాలో నమో

**డ్రమ్ము వాయించిన మోడీ • ద్వైపాక్షిక సహకారం పెంపొందించుకునే యత్నంలో భాగమే ప్రధాని పర్యటన**

**విండ్ హాక్(నమీబియా), జూలై 9:** ఎనిమిది రోజుల తన విదేశీ పర్యటనలో భాగంగా బుధవారం మోడీ నమీబియాకు చేరుకున్నారు. ఆ దేశ అధ్యక్షురాలు నెటుంబో నంది ఎన్డైత్వా ఆహ్వానం మేరకు తొలిసారి ఆ దేశంలో పర్యటిస్తున్నారు. నమీబియాలోని విండ్ హాక్ కు చేరుకున్న మోడీకి ఘన స్వాగతం లభించింది. విమానాశ్రయంలో ఆ దేశ అధ్యక్షురాలు స్వయంగా ఆహ్వానించారు. అనంతరం నిర్వహించిన సంప్రదాయ స్వాగత కార్యక్రమాలు అలరించాయి. అక్కడి కళాకారులతో కలిసి మోదీ కూడా డప్పు కొడుతూ వారిని ఉత్సాహపరిచారు. జులై 2 నుంచి మోదీ విదేశీ పర్యటనలో ఉన్నారు. ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్ తర్వాత చివరగా నమీబియాకు వచ్చారు. ఆ దృశ్యాలను ఎక్స్ వేదికగా షేర్ చేశారు. ''ఇప్పుడే విండ్ హాక్ లో అడుగుపెట్టాను. ఈ దేశం విశ్వసనీయ ఆఫ్రికన్ భాగస్వామి. వీరితో ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించుకోవాలని కోరుకుంటున్నాం'' అని వెల్లడించారు.

## అంతరిక్షంలో అగ్రి రీసెర్చ్



జీరో గ్రావిటీలో రకరకాల పరిశోధనలు చేస్తున్న శుభాంశు శుక్లా

2





# మంత్రులకు సీఎం క్లాస్

## మంత్రుల పనితీరుపై అసంతృప్తి

- వైసీపీ కుట్రలపై సీఎం సీరియస్
- వివిధ సంస్థలకు మెయిళ్లు పెట్టడంపై అసహనం
- ప్రభుత్వ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నారు
- వైకాపా కుట్రలపై విచారణకు ఆదేశిస్తాం
- మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు

**అమరావతి:** ఏపీకి పెట్టుబడులు రాకుండా అడ్డుకునేందుకు వైకాపా చేస్తున్న కుట్రలపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీసేలా వివిధ సంస్థలకు మెయిళ్లు పెట్టడాన్ని సీఎం తీవ్రంగా పరిగణించారు.

పెట్టుబడులను అడ్డుకునేందుకు వైకాపా చేస్తున్న కుట్రలను మంత్రివర్గ సమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రస్తావించారు. ఏపీఎండీసీ బాండ్లలో పెట్టుబడులు పెట్టొద్దని 200 కంపెనీలకు ఈ-మెయిళ్లు పెట్టారని తెలిపారు. వైకాపా కుట్రలపై విచారణకు ఆదేశిస్తామని మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు ప్రకటించారు.

**మంత్రులు సంతృప్తికరంగా పనిచేయడం లేదు**

మంత్రులెవరూ సంతృప్తికరంగా పనిచేయడం లేదని మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మహిళా ఎమ్మెల్యేను కించపరిస్తే ఎందుకు స్పందించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. జరుగుతున్న పరిణామాలపై ప్రతి మంత్రీ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏడాది వ్యవధిలో నిత్యావసరాల ధరలు గణనీయంగా తగ్గించామని సీఎం చెప్పారు. ప్రజలకు లబ్ధి చేకూర్చడంలో మంత్రివర్గ ఉపసంఘం బాగా కృషి చేసిందన్నారు. చేసిన మంచిని ప్రజలకు చెప్పడంలో విఫలమయ్యారని చంద్రబాబు ఆక్షేపించారు. జగన్ కుట్రలను ఎక్కడికక్కడ తిప్పికొట్టాలన్నారు.

## బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

**మంత్రి నాదెండ్ల మనోహర్**



**విజయవాడ, జూలై 9 (మనం ప్రతినిధి):** రాష్ట్రం నుంచి ఇతర దేశాలకు బియ్యం ఎగుమతులకు ప్రభుత్వం వ్యతిరేకం కాదని ఆహార, పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఎగుమతి దారులు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ సులభంగా ఎగుమతులు చేసుకోవచ్చని సూచించారు.మంత్రి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలోని రెండో బ్లాక్లోని మంత్రి చాంబర్లో కాకినాడ, విశాఖపట్నం, నెల్లూరు జిల్లాల జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో నుంచి బయటకు వెళ్ళే బియ్యం సరఫరాలో పిడిఎస్ (సబ్సిడీ) బియ్యం కలిపే ప్రసక్తే లేకుండా కఠినంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే నమోదవుతున్న 6అ కేసులతో పాటు పీడీ యాక్ట్, బి ఎన్ ఎస్ సెక్షన్ల కింద కేసులు కూడా నమోదు చేయాలని స్పష్టం చేశారు. విశాఖపట్నం, కాకినాడ, నెల్లూరు పోర్టు ప్రాంతాల్లో చెక్పోస్టులు ఏర్పాటు చేసి 24/7 సిబ్బంది తో తనిఖీలు చేపట్టాలని, అవసరమైతే చెక్‌పోస్టులు పెంచాలని సూచించారు. కాకినాడ పోర్ట్

...మిగతా 2లో

## కేంద్ర హిందీ సలహా సమితిలో ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్కు సభ్యత్వం



**ఢిల్లీ,జూలై 9 (మనం న్యూస్):** కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన రెవెన్యూ విభాగం లో పునఃరూపకల్పన చేసిన సంయుక్త హిందీ సలహా సమితిలో ఆంధ్రప్రదేశ్కు చెందిన ప్రముఖ విద్యావేత్త, రచయిత ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ను సభ్యునిగా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీకి ఆర్థిక మంత్రి ఛైర్మన్గా, సహాయ ఆర్థిక మంత్రి వైస్ ఛైర్మన్గా వ్యవహరిస్తారు. విభిన్న కేంద్ర శాఖలైన రెవెన్యూ, వ్యయము, పెట్టుబడి, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ కార్యాలయాల పరిపాలనలో హిందీ భాషా వినియోగాన్ని ప్రోత్సహించడమే ఈ కమిటీ ముఖ్య ఉద్దేశంగా ఉంది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన

...మిగతా 2లో

## లెనిన్ సెంటర్ పేరు మార్చాలి

**బిజెపి రాష్ట్ర నూతన అధ్యక్షుడు పీ వీ ఎన్ మాధవ్**

**విజయవాడ పశ్చిమ, జూలై 09 (మనం న్యూస్):** విజయవాడ లెనిన్ సెంటర్ పేరు మార్చి కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ పేరు పెట్టాలని బిజిపి రాష్ట్ర నూతన అధ్యక్షుడు పీ వీ ఎన్ మాధవ్ అన్నారు. బుధవారం నాడు విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి ర్యాలీ గా వెళ్లిన మాధవ్ ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తో కలిసి లెనిన్ సెంటర్ లోని

...మిగతా 2లో



## పరామర్శల పేరుతో జగన్ విధ్వంసకర ర్యాలీలు: మంత్రి అచ్చెన్నాయుడు



2

## 3 గేట్లు 10 అడుగుల ఎత్తులో తెరచి



2

## మహాపూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు



**తిరుపతి,జూలై 09, మనం న్యూస్:** తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు బుధవారం మహాపూర్ణాహుతితో వైభవంగా ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం యాగశాల పూజ, హోమం, మహా పూర్ణాహుతి, కలశోద్వాసన, మూలవర్లకు కలశాభిషేకం, పట్టుపవిత్ర సమర్పణ చేపట్టారు. మధ్యాహ్నం 03 గంటల నుండి 03.30 గంటల మధ్య అభిషేకం, అనంతరం అలంకారం, సహస్రనామార్చన నిర్వహించారు. సాయంత్రం పంచమూర్తులైన శ్రీ వినాయక స్వామి, వళ్లి దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి, శ్రీ కపిలేశ్వర స్వామి, శ్రీ కామాక్షి అమ్మవారు, శ్రీ చండికేశ్వరస్వామివారి తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. పవిత్రోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు పవిత్రమాల, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## ఆ ప్రాజెక్టు చైనా చేతిలో 'వాటర్ బాంబు'

**అరుణాచల్ ప్రదేశ్ సీఎం పెమా ఖండూ ఆందోళన**



**ఇటానగర్, జూలై 9:** చైనా నిర్మించ తలపెట్టిన భారీ జలవిద్యుత్ ప్రాజెక్టుపై మన సరిహద్దు రాష్ట్రాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ మరోసారి దీనిపై స్పందించారు. ఆ మెగా డ్యామ్ ఒక వాటర్ బాంబ్ అని, అస్తిత్వానికి ముప్పు అని వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఓ వార్తా సంస్థతో మాట్లాడారు. 'సమస్య ఏమిటంటే చైనాను విశ్వసించలేం. వారేం చేస్తారో తెలియదు. చైనా నుంచి వచ్చే సైనికపరమైన ముప్పును పక్కనపెడితే.. ఇది అన్నింటికంటే పెద్ద సమస్య అని నాకు అనిపిస్తోంది. ఇది అస్తిత్వ ముప్పును కలిగిస్తుంది. ఈ డ్యామ్ ను చైనా వాటర్ బాంబ్ గా కూడా ఉపయోగించవచ్చు. నీటి పంపకాల ఒప్పందాలపై చైనా సంతకాలు చేసి ఉంటే.. ఈ ప్రాజెక్టు ఒక వరం. అరుణాచల్ ప్రదేశ్, అసోం, బంగ్లాదేశ్ లో వేసవి వరదలను నిరోధించే అవకాశం ఉంటుంది. కానీ ఆ దేశం ఎలాంటి సంతకాలు చేయలేదు. ఆ డ్యామ్ నిర్మిస్తే.. వారు ఒక్కసారిగా నీటిని విడుదల చేయొచ్చు. దాంతో సియాంగ్ ప్రాంతమంతా ధ్వంసమవుతుంది. ఆ డ్యామ్ పూర్తయితే మన సియాంగ్, బ్రహ్మపుత్ర నదులు ఎండిపోవచ్చు. అసలు ఆ దేశం ఈ ప్రాజెక్టు గురించి ఎలాంటి సమాచారం పంచుకోవడం లేదు' అని సీఎం పేర్కొన్నారు. నది అరుణాచల్ ప్రదేశ్ లోకి ప్రవేశించేందుకు మలుపు తిరిగే ప్రదేశంలో నదిపై నిర్మించనున్న ఈ ప్రాజెక్టుపై దిగువ పరీవాహక దేశాలైన భారత్,

...మిగతా 2లో

## వేదాలు చదువుత.. ప్రకృతి వ్యవసాయం చేస్త..

**తన రిటైర్మెంట్ ప్లాన్‌ను వెల్లడించిన కేంద్ర మంత్రి అమిత్ షా**



**ఢిల్లీ, జూలై 9:** ప్రజా జీవనం నుంచి వైదొలిగిన అనంతరం తాను వేదాలు, ఉపనిషత్తులు చదవడంతోపాటు ప్రకృతి వ్యవసాయంపై దృష్టిపెడతానని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పారు. గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల సహకార సంఘాల మహిళలతో మాట్లాడుతూ ఆయన పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. 'రిటైర్మెంట్ తర్వాత వేదాలు, ఉపనిషత్తులు చదవడంతోపాటు, ప్రకృతి వ్యవసాయానికే సమయాన్ని కేటాంచాలని నిర్ణయించుకున్నా. రసాయన ఎరువులతో

...మిగతా 2లో

## గగనయానంలో హాట్ టెస్ట్ సక్సెస్



**బెంగళూరు, జూలై 9:** గగన్ యాన్ ప్రాజెక్టులో ఇస్రో మరో ముందడుగు వేసింది. గగన్ యాన్ సర్వీస్ మాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టమ్‌కు సంబంధించి రెండు హాట్ టెస్టులను విజయవంతంగా నిర్వహించింది. మహేంద్రగిరిలోని ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో జులై 3న వీటిని నిర్వహించినట్లు

...మిగతా 2లో

## కనిపిస్తే కాల్చేయండి

**రిజర్వేషన్ వ్యతిరేక నిరసనకారులను 'ఎట్ ఎనీ కాస్ట్' కట్టడి చేయాలని ఆదేశించిన హసీనా**



**ఢాకా, జూలై 9:** గతేడాది రిజర్వేషన్లకు వ్యతిరేకంగా నిరసనలు చెలరేగిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో నిరసనకారులను కట్టడి చేసేందుకు దేశ ప్రధానిగా ఉన్న షేక్ హసీనా పోలీసులకు జారీ చేసిన ఆడియో ఒకటి తాజాగా లీక్ అయింది. లీకైన ఆడియో ప్రకారం.. నిరసనకారులను కట్టడి చేయడానికి ప్రాణాంతకమైన ఆయుధాలను వినియోగించాలని ఒక సీనియర్ పోలీసు అధికారికి హసీనా ఈ ఆదేశాలు

...మిగతా 2లో

## బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

వద్ద పిడిఎస్ బియ్యం నియంత్రణ బాగా జరుగుతోందని, అలాగే విశాఖ, నెల్లూరు పోర్ట్ ప్రాంతాలను కూడా మరింత పటిష్టం చేయాలని సూచించారు. విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తనిఖీలు మరింత ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశించారు. జాతీయ రహదారులపై కూడా అవసరమయ్యే చోట చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. కాకినాడ జిల్లాలో మొత్తం 85 కేసులు, అందులో 21 కేసులు పోర్ట్ ఏరియాలో విశాఖపట్నం జిల్లాలో 92 కేసులు, అందులో 9 పోర్ట్ ప్రాంతానికి, నెల్లూరు జిల్లాలో 62 కేసులు, అందులో 6 కేసులు కృష్ణపట్నం పోర్టుకు సంబంధించినవి. ఇక మీదట ఎగుమతుల రూపంలో పిడి ఎస్ బియ్యాన్ని ఇతర దేశాలకు రవాణా చేయాలని చూసే వ్యక్తులపై కఠినంగా వ్యవహరించాలని పోలీస్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

## పరామర్శల పేరుతో జగన్ విధ్వంసకర ర్యాలీలు: మంత్రి అచ్చెన్నాయుడు

**అమరావతి:** రైతుల పరామర్శ పేరుతో విధ్వంసకర ర్యాలీలు చేయడం జగన్‌కే చెల్లాయని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. బంగారుపాళ్యంలో హెలీప్యాడ్ నుంచి పర్యటన చేసే స్థలం వద్దకు ర్యాలీగా రావడంపై మండిపడ్డారు. హెలిప్యాడ్ వద్దకు 30 మందికి అనుమతిస్తే 300 మంది వచ్చారన్నారు. సీఎంగా పని చేసిన వ్యక్తి ఈ సమాజానికి ఎలాంటి మెసేజ్ ఇస్తున్నారు?అని ప్రశ్నించారు. ముందు వేసుకున్న ప్లాన్ ప్రకారమే ర్యాలీలు చేస్తున్నారన్నారు. పోలీసులు, విలేకరులపైనా దాడులకు తెగబడుతున్నారన్నారు. మంత్రివర్గం సమావేశం అనంతరం సహచర మంత్రులు నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్‌తో కలిసి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు.

**డిమాండ్ లేకపోవడం వల్లే మామిడి ధర తగ్గింది**

రాబోయే సమస్యలను ముందే ఊహించి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో మామిడి రైతులు ఇబ్బందులు పడ్డారు. 2.5లక్షల టన్నుల తోతాపురి మామిడి ఉత్పత్తి జరిగింది. మామిడి ఉత్పత్తి బాగా పెరిగే సరికి ధర తగ్గింది. తోతాపురి మామిడిని పల్ప్ పరిశ్రమలే కొంటాయి. గతేడాది నిల్వలు ఉండటంతో ఆ పరిశ్రమలూ ఈసారి కొనలేదు. తోతాపురి మామిడిని రూ.12కు కొనాలని నిర్ణయించాం. రూ.8కు మామిడి కొనాలని ఆయా పరిశ్రమలకు చెప్పాం. ప్రభుత్వం తరఫున కిలోకు రూ.4 సాయం చేస్తామని చెప్పాం. అన్నమయ్య జిల్లాలో 99శాతం కొనుగోలు చేశాం. చిత్తూరు జిల్లాలో 80శాతం కొనుగోలు జరిగింది.. ఇంకా కొంటున్నాం.

**క్రిమినల్ మైండ్‌తోనే ఇలా చేస్తున్నారు**

రైతులను ఆదుకున్నాక ఇప్పుడు పర్యటనలు చేయడం సరికాదు. ఐదేళ్ల పాటు ఎవరినీ పరామర్శించకుండా మమ్మల్ని అడ్డుకున్నారు. రైతుల సమస్య పరిష్కరించాలన్న ఆలోచనే జగన్‌కు లేదు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తున్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చూడటమే జగన్ ఉద్దేశంగా కనబడుతోంది. ముందుకెళ్లిన కారు వెనక్కి రావడం.. పక్కకు రావడం అంతా ఓ ప్లాన్. చిత్తూరు జిల్లా రైతు ప్రకాశ్‌రెడ్డి తోటలోని మామిడిని ముందే అమ్మేశారు. జగన్ కారు వచ్చాక ట్రాక్టర్ల నుంచి మామిడిని కింద పోశారు. ముందుగా వేసుకున్న ప్లాన్ ప్రకారమే రోడ్లపై మామిడిని పోశారు. మామిడిని ముందే తోటలోకి చేరవేసి జగన్ వచ్చినప్పుడు ఇలా చేశారు. క్రిమినల్ మైండ్‌తోనే ఇలాంటి పనులు చేస్తున్నారు''అని అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## లెనిన్ సెంటర్ పేరు మార్చాలి

(మొదటి పేజీ తరువాయి)

విశ్వనాథ సత్యనారాయణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెనిన్ కు మన భారతదేశానికి ఎటువంటి సంబంధం లేనప్పుడు లెనిన్ పేరు పెట్టాల్సిన అవసరం ఏంటి అని ప్రశ్నించారు. తెలుగు భాష కోసం నిరంతరం శ్రమించిన కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ పేరు పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని వారి సిద్ధాంతాలను కొనసాగిస్తానని మాధవ్ తెలిపారు. తానే అధ్యక్షుడు అయ్యానని ప్రతీ కార్యకర్త భావించే విదంగా తాను పనిచేస్తానని మాధవ్ అన్నారు. బుదవారం నాడు బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాకంటే ముందు అధ్యక్షులైన వారి శక్తి యుక్తులతో ముందుకు వెళ్తాను అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు అరాచక పాలనకు చరమగీతం పాడారని కూటమి ప్రభుత్వానికి అత్యధిక మెజారిటీ నిచ్చి గెలిపించారన్నారు. బీజేపీ ఇచ్చిన ఈ పదవిని గౌరవంగా భావించి బాధ్యతాయుతంగా నిర్వహిస్తానని తెలిపారు.

## ఆ ప్రాజెక్టు చైనా చేతిలో 'వాటర్ బాంబు'

(మొదటి పేజీ తరువాయి)

బంగా దేశ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. భూమిపై ఇప్పటి వరకూ నిర్మితమైన ప్రాజెక్టులన్నిటి కంటే పెద్దదైన దీని నిర్మాణ వ్యయం 137 బిలియన్ డాలర్లుగా ఉంది. భారత చైనాల మధ్య కుదిరిన ఒక ఒప్పందం ప్రకారం ఎగువనున్న చైనా బ్రహ్మపుత్ర జలసంబంధ (హైడ్రలాజికల్) సమాచారాన్ని దిగువనున్న భారత్ తో పంచుకోవాల్సి ఉంది. కానీ, ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన దరిమిలా చైనా ఆ సమాచారాన్ని పంచుకోవడంలేదు. బ్రహ్మపుత్ర నదీ జలాలపై తొలిసారిగా 2002లో ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఆ తర్వాత 2008, 2013, 2018లో నాటి పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేశారు. చివరిసారిగా కుదిరిన ఒప్పందం 2023తో ముగిసింది. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఆ తర్వాత కొత్త ఒప్పందం కుదరలేదు.

ఈ తరుణంలో ప్రాజెక్టు నిర్మాణానికి చైనా సిద్ధమవడం మనను కలవరపెడుతోంది. ఒక వేళ చైనా ప్రతిపాదిత ప్రాజెక్టును పూర్తి చేస్తే భారత్ కు అపార నష్టం కలిగే అవకాశముంది. ఎండాకాలంలో బ్రహ్మపుత్ర నీటిని మళ్లించేందుకు బీజింగ్కు అవకాశం ఏర్పడుతుంది. దీంతో అస్సాం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. మరోవైపు వర్షాకాలంలో బ్రహ్మపుత్ర నదికి భారీగా వరద ఉంటుంది. ఒకేసారి పెద్దమొత్తంలో నీటిని విడుదల చేస్తే.. దిగువనున్న ప్రాంతాలు ముంపునకు గురవుతాయి. చైనా నిర్మించదలచుకున్న ప్రాజెక్టు భారత్-చైనా సరిహద్దుకు కేవలం 30 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. అందువల్ల రక్షణ పరంగానూ భారత్కు సమస్యలు పొంచి ఉన్నాయి. ఒక వేళ యుద్ధ పరిస్థితులు తలెత్తితే ఈ ప్రాజెక్టులో నిల్వ చేసిన నీటిని చైనా 'వాటర్ బాంబ్'గా (ఒకేసారి విడుదలచేసిన దిగువ ప్రాంతాలను ముంచివేయడం) వాడుకునే ప్రమాదముందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.



## కేంద్ర హిందీ సలహా సమితిలో ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్కు సభ్యత్వం

(మొదటి పేజీ తరువాయి)

పార్లమెంటు సభ్యులు, భాషా నిపుణులు, హిందీ ప్రచార సంస్థల ప్రతినిధులు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. అందులో భాగంగా లక్ష్మీప్రసాద్ గారికి అవకాశం లభించింది. పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న డా. యర్లగడ్డ హిందీతో పాటు తెలుగు భాషా అభివృద్ధికి విశేష సేవలు అందించారు. ఈ నూతన బాధ్యత ద్వారా కేంద్ర పరిపాలన వ్యవస్థలో హిందీ అభివృద్ధికి కృషి చేస్తానని యార్లగడ్డ తెలిపారు.

## 3 గేట్లు 10 అడుగుల ఎత్తులో తెరచి

**శ్రీశైలం జులై 09(మనంన్యూస్):** శ్రీశైల జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతూనే ఉంది. మూడు క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 80,646 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. జలాశయానికి బుధవారం జూరాల ప్రాజెక్టు విద్యుదోత్పత్తి ద్వార 28,658 క్యూసెక్కులు, క్రస్ట్ గేట్ల ద్వార 94,878 క్యూసెక్కులు, సుంకేసుల నుండి 57,515 వేల క్యూసెక్కుల నీరు విడుదలై సాయంత్రానికి 1,87,915 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్కు చేరింది. అదే విధంగా జలాశయం పూర్తిస్థాయి నీటినిల్వ 885 అడుగులు కాగా ప్రస్తుతం 882.40 అడుగులు ఉండగా పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 215.8070 టీఎంసీలు కాగా ప్రస్తుతం 201.1205 టీఎంసీలు ఉన్నాయి. కుడి, ఎడమ జల విద్యుతోత్పత్తి కేంద్రాలద్వార67,299 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్కు విడుదల చేస్తున్నారు.

## వేదాలు చదువుత.. ప్రకృతి వ్యవసాయం చేస్త..

(మొదటి పేజీ తరువాయి)

పండించే పంటలతో వివిధ ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. ప్రకృతి వ్యవసాయం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. శరీరాన్ని వ్యాధులకు దూరంగా ఉంచడంతోపాటు వ్యవసాయ ఉత్పాదకతను పెంచుతుంది' అని అమిత్ షా పేర్కొన్నారు. సహకార శాఖ మంత్రిగా తన ప్రయాణం ఎంతో అద్భుతంగా ఉందని అమిత్ షా పేర్కొన్నారు. 'హోంశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడు ముఖ్యమైన శాఖ ఇచ్చారని అందరూ అన్నారు. కానీ, సహకారశాఖ మంత్రి బాధ్యతలు అప్పగించినప్పుడు మాత్రం.. హోంశాఖ కంటే పెద్ద శాఖ ఇచ్చారని నేను భావించా. ఎందుకంటే ఈ శాఖ దేశంలోని రైతులు, పేదలు, గ్రామాలు, పశుసంపద కోసం పనిచేస్తుంది' అని అమిత్ షా వివరించారు.

## గగనయానంలో హాట్ టెస్ట్ సక్సెస్

(మొదటి పేజీ తరువాయి)

ఇస్రో తెలిపింది. స్వల్పకాలిక పరీక్షల్లో భాగంగా 30 సెకన్లు, 100 సెకన్ల పాటు రెండు హాట్ టెస్టులను నిర్వహించినట్లు బుధవారం వెల్లడించింది. ఆర్బిటల్ కాన్ఫిగరేషన్ను ధ్రువీకరించే లక్ష్యంతో ఈ పరీక్షలు చేపట్టామని పేర్కొన్నది. 'ఈ హాట్ టెస్టుల సమయంలో ప్రొపల్షన్ సిస్టమ్ పనితీరు ముందస్తు అంచనాల ప్రకారం సాధారణంగా ఉంది. ఈ టెస్టులు విజయవంతమయ్యాయి' అని ప్రకటించింది. ఈ హాట్ టెస్టుల్లో సాధించిన సక్సెస్ విశ్వాసంతో.. త్వరలో పూర్తి వ్యవధి టెస్టులను నిర్వహిస్తామని ఇస్రో వెల్లడించింది.

భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపే లక్ష్యంతో ఇస్రో ప్రతిష్ఠాత్మక గగన్యాన్ మిషన్ను చేపట్టిన విషయం తెలిసిందే. భారత అంతరిక్ష కార్యక్రమాల్లో ఇది కీలకం కానుంది. ఈ క్రమంలో చేపడుతున్న పరీక్షలు విజయవంతం అవుతున్నాయి. ఈ గగన్ యాన్ ప్రాజెక్టు ప్రపంచ అంతరిక్ష రంగంలో భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేయనుంది. గగన్ యాన్ యాత్రను 2027 తొలి త్రైమాసికంలో చేపట్టే అవకాశాలున్నట్లు ఇస్రో ఛైర్మన్ నారాయణన్ ఇటీవల వెల్లడించిన విషయం తెలిసిందే.

## ఆంధ్రజ్యోతి సీనియర్ స్టాఫ్ ఫోటోగ్రాఫర్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి

- **ఏపీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్**

**చిత్తూరు,జూలై 09,మనం న్యూస్ :**వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి బంగారుపాలెం పర్యటనలో భాగంగా ఫోటోల చిత్రీకరణ నిమిత్తం విధి నిర్వహణలో ఉన్న చిత్తూరు నగర ఆంధ్రజ్యోతి సీనియర్ ఫోటో జర్నలిస్ట్ శివకుమార్ పై దాడి చేసినవారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ( ఎపిడబ్ల్యూజేఎఫ్ ) రాష్ట్ర నాయకులు కవరకుంట్ల జయరాజ్, జిల్లా అధ్యక్షుడు బీ ప్రకాష్ డిమాండ్ చేశారు. ఫోటోగ్రాఫర్ పై దాడిని నిరసిస్తూ ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు బుధవారం సాయంత్రం చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంగారుపాలెం మామిడికాయల మార్కెట్ యార్డ్ వద్ద ఫోటోలు తీస్తున్న ఫోటోగ్రాఫర్ ను కొట్టడం, కెమెరాకు సంబంధించి మెమొరీ కార్డుని లాక్కోవడం




దారుణమన్నారు. దాడి చేసిన వారిపై వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దర్యాప్తు చేసి దాడులకు కారణమైన వారిని అరెస్ట్ చేయాలని కోరారు. జర్నలిస్టుల రక్షణ కోసం ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఓ ప్రత్యేకమైన చట్టాన్ని రూపొందించాలని కోరారు. మీడియా కమిషన్ ఏర్పాటు చేయడం వల్ల ఇలాంటి దాడులను నివారించవచ్చని సూచించారు. జర్నలిస్టులపై దాడులను ఆపకపోతే ఎలా ఆన్నారు రానున్న రోజుల్లో ఏపీడబ్ల్యూజేఎఫ్ తరపున ఆందోళనలను తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ఏపీడబ్ల్యూజేఎఫ్ కోశాధికారి కృపానందరెడ్డి, చిత్తూరు నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ కేశవులు, బాలసుబ్రమణ్యం, ఉపాధ్యక్షుడు తులసి రామ్ ,సంయుక్త కార్యదర్శులు కుబేంద్రన్, ప్రసాద్ కోశాధికారి నాగరాజు,జి ఏపీడబ్ల్యూజేఎఫ్ సీనియర్ నేతలు మంజునాథ్, మురళి దాము, సిఐటియు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.




## ఓటర్ల సవరణ పక్కాగా చేపట్టాలి

**స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ**

మంత్రాలయం, జూలై 9(మనం న్యూస్): త్వరలో నిర్వహించనున్న ఓటర్ల సవరణ పక్కాగా చేపట్టాలని మంత్రాలయం నియోజకవర్గం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ పేర్కొన్నారు. బుధవారం నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలోని తాసిల్దార్ కార్యాలయంలో బూతు స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్లు నమోదు ప్రక్రియలో బీఎల్వోల పాత్ర చాలా కీలకమన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు 5 రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రమాదేవి , డిప్యూటీ తహశీల్దార్ గురురాజ్ రావు , మాస్టర్ ట్రైనర్ కన్నడ రాజు , వీరేష్ పాల్గొన్నారు.

## కనిపిస్తే కాల్చేయండి

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేసినట్లు తెలుస్తోంది. అంతేకాక, వారు ఎక్కడ కనిపించినా కాల్చేయాలని ఆదేశించారు. గతేడాది జులై 18న ఢాకాలోని తన అధికార నివాసం 'గణభబన్' నుంచి ఆమె ఈ ఆదేశాలిచ్చినట్లు సమాచారం. ఇది జరిగిన కొన్ని గంటల తర్వాత నిరసనలను కట్టడి చేసేందుకు పోలీసు అధికారులు పలు ఆయుధాలు ఉపయోగించినట్లు బీబీసీ పత్రాలు వెల్లడిస్తున్నాయి.

బంగ్లాలో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా అల్లర్లు చోటుచేసుకున్నాయి. దీని కారణంగా 1,400 మంది ప్రాణాలు కోల్పోయారని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. ఈ నిరసనల నేపథ్యంలోనే హసీనా ప్రభుత్వం కుప్పకూలిపోయింది. దీంతో పదవీచ్యుతురాలైన ఆమె.. స్వదేశాన్ని వీడి భారత్‌లో రహస్య ప్రాంతంలో నివసిస్తున్నారు. మహమ్మద్ యూనస్ నేతృత్వంలో బంగ్లాలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. అప్పటి నుంచి హసీనాను స్వదేశానికి రప్పించాలని ఆ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. మరోవైపు.. ఆమెపై స్వదేశంలో అనేక కేసులు నమోదయ్యాయి. ఇంటర్నేషనల్ క్రైమ్ ట్రైబ్యునల్ హసీనాకు ఆరు నెలల జైలు శిక్ష వేసింది.

## కిడ్ జీ పాఠశాలను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన ఎమ్మెల్యే పులివర్తి నాని

**తిరుచానూరు,జూలై 09,మనం న్యూస్:** తిరుపతి రూరల్ మండలం పద్మావతిపురం పంచాయతీలోని వర్షా విశ్వనాథ్ నగర్ లో నూతన కిడ్ జీ పాఠశాల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి రూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి. విశ్వనాథ్ నగర్ కు విచ్చేసిన ఎమ్మెల్యే గారిని శాలువాతో సత్కరించి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికిన స్కూల్ యాజమాన్యం. కిడ్ జీ పాఠశాలను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన ఎమ్మెల్యే పులివర్తి నాని. ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తిరుపతి రూరల్ మండలం పద్మావతిపురం పంచాయతీ పరిధిలోని విశ్వనాథ్ నగర్ లో కిడ్ జీ



పాఠశాల ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. తిరుపతి రూరల్ మండలం పరిధిలోని ఇప్పుడు విశ్వనాథ్ నగర్ లో చిన్న పిల్లలకు మెరుగైన విద్యతో మంచి వసతులతో స్కూల్ ప్రారంభించడం చాలా సంతోషం. నేటి పిల్లలే రేపటి పౌరులు వారికి మెరుగైన విద్యను అందిస్తే మంచి పౌరులుగా తీర్చిదిద్దిన వారం అవుతామన్న దృడ సంకల్పంతో కిడ్ జీ స్కూల్ పెట్టడం జరిగిందని అన్నారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విద్యా వ్యవస్థలో పెను మార్పులు తెచ్చి భారతదేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా వ్యవస్థను మొదట స్థానంలో నిలబెట్టాలని పట్టుదలతో చాలా మార్పులు తీసుకువచ్చరన్నారు. ఈ కార్యక్రమంలో తిరుచానూరు టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు కిషోర్ రెడ్డి, హరి రామ్ రెడ్డి, దామ సాయి రాయల్, డిస్కో శివ, వాసు, కిడ్ జీ పాఠశాల యాజమాన్యం మరియు సిబ్బంది, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంతరిక్షంలో 'అగ్రి రీసెర్చ్'

- **జీరో గ్రావిటీలో రకరకాల పరిశోధనలు చేస్తున్న శుభాంశు శుక్లా**

**ఢిల్లీ, జూలై 9:** భారతీయ వ్యోమగామి శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో వివిధ పరిశోధనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఇప్పుడాయన గురుత్వాకర్షణ లేని పరిస్థితుల్లో మెంతి, పెసర సాగుపై అధ్యయనం చేస్తున్నారు. వాటికి సంబంధించిన ఫొటోలను పంపించారు. ధార్వాడ్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన రవికుమార్ హోసమణి, ఐఐటీకి చెందిన సుధీర్ సిద్దపురెడ్డి అనే శాస్త్రవేత్తల సహాయంతో శుక్లా ఈ ప్రయోగాన్ని చేశారు. భూమిపైకి వచ్చాక ఆ మొలకలలో వచ్చిన జన్యుమార్పులు, పోషక విలువలను పరిశీలించనున్నట్లు యాక్సియం స్పేస్ వెల్లడించింది. మరో ప్రయోగంలో.. శుక్లా మైక్రోఆల్గేలను అధ్యయనం చేశారు. వీటికి జీరో గ్రావిటీలో ఆహారం, ఆక్సిజన్, జీవ ఇంధనాలను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని పరిశీలించారు. స్టెమ్ సెల్ పరిశోధన, విత్తనాలపై సూక్ష్మ గురుత్వాకర్షణ ప్రభావాన్ని అధ్యయనం చేయడం, వ్యోమగాములు స్టేషన్లోని స్క్రీన్లతో సంభాషించేటప్పుడు సమాచారాన్ని విశ్లేషించే వారి మానసిక సామర్థ్యం వంటి విషయాలను గమనిస్తున్నానని..ఈ విషయాలు తనకు ఆనందాన్ని కలిగిస్తున్నాయని శుభాంశు ఈ సందర్భంగా పేర్కొన్నారు. పరిశోధకులకు, స్పేస్ స్టేషన్ కు మధ్య వారధిగా ఉండి ఎరిశోధనలు నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. యాక్సియం-4 ప్రైవేట్ స్పేస్ మిషన్లో భాగంగా శుభాంశు శుక్లా మరో ముగ్గురు వ్యోమగాములతో కలిసి గత వారం ఐఎస్ఎస్ చేరుకున్న సంగతి తెలిసిందే. రోదసిలో మానవ జీర్ణ వ్యవస్థ ఎలా పనిచేస్తుందన్న అంశంపై ఒక వీడియోను భారత విద్యార్థుల కోసం చిత్రించారు. ప్రయోగాల్లో భాగంగా వ్యోమగాముల బృందం తమ మానసిక ఆరోగ్యంపై సైతం అధ్యయనం చేసుకుంటోంది.

## శ్రీ రంగనాథ స్వామిని దర్శించుకున్న దేవాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్..

**మద్దికెర జులై 9(మనం న్యూస్):** మద్దికెర మండల పరిధిలో పెరవలి వెలసిన శ్రీ రంగనాథస్వామిని దేవాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ యస్.యస్ చంద్రశేఖర్ ఆజాద్ మరియు కసాపురం ఈవో వాణి బుధువారం దర్శించుకున్నారు. అనంతరం స్వామివారికి దేవాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ప్రత్యేకపూజలు చేయించారు.ఈ కార్యక్రమంలో పెరవలి దేవస్థానం ఈవో రెబ్బ వీరయ్య,దేవాదాయ శాఖ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఇంటి నుండి ఆత్మీయ స్వాగతం పిలుపు

**కౌతాళం జూలై 9 మనం న్యూస్:** సుపరిపాలనలో తొలి -అడుగు ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమము లో టి.బి.పి చైర్మన్ టిప్పుసుల్తాన్, మంత్రాలయం తెదేపా సీనియర్ నాయకులు చూడి ఉలిగయ్య కుమారులు సతీష్ నాయుడు సురేష్ నాయుడు. బుధవారం రోజున ఉదయం కౌతాళం మండలం తిప్పలదొడ్డి మరియు మల్లనహట్టి గ్రామములో కూటమి ప్రభుత్వం ఆదేశాలు మరియు మంత్రాలయం తెదేపా ఇంచార్జీ వర్యులు రాఘవేంద్ర రెడ్డి పిలుపు మేరకు గ్రామంలో ఇంటింట వెళ్ళడం జరిగినది.ఈ సందర్భంగా గ్రామములో ప్రతి ఇంటికి వెళ్ళినప్పుడు ఆత్మీయ స్వాగతం పలుకుతున్నారాని ఈ కూటమి సుపరిపాలనలో ప్రతిఒక్కరు సంతోషంగా ఉన్నారని,ఈ ప్రజా ప్రభుత్వంలో సంక్షేమాలు,గ్రామ అభివృద్ధికి ప్రతి సామాజిక వర్గం ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఏడాదిలోనే అందిస్తున్న సంక్షేమ లబ్ధిని,అభివృద్ధిని గుర్చి తెలియజేశారు.ప్రజల నుండి ఇలాంటి మంచి స్పందన రావడం మనకు ఎంతో సంతోషాన్ని



కలిగించిందని ఈ కార్యక్రమములో యువ నాయకులు మరియు టీబీపీ చైర్మన్ క్లస్టర్, యూనిట్ ఇంచార్జీలు తెలియజేశారు. ఈ కార్యక్రమములో తిక్కయ్య, రామలింగ అన్న,మాధవ రెడ్డి,కకమ్ మల్లయ్య,అనుమేష్, అంజి, లక్ష్మణ్, లక్ష్మయ్య,మహాదేవ, చిన్న సిద్దయ్య, నభీ సాబ్,గోపాల్, అల్లయ్య, బసవరాజు,చిన్న లక్ష్మణుడు, ఈశ్వర్, బుడ్డయ్య,మహాదేవ, వెంకటేష్,ఈరన్న, చిరంజీవి, శ్రీధర్, సన్నప్ప ,సురేష్ మొదలగు కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగినది.

## తొలి ప్రయత్నంలోనే డక్ అవుట్' అయిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

- **సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ**

**విజయవాడ సెంట్రల్, జూలై 09 (మనం న్యూస్):** బిజెపి ఎపి అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన మాధవ్ తొలి ప్రయత్నంలోనే డకవుట్ అయ్యారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఎద్దేవా చేశారు. ఈ మేరకు కె రామకృష్ణ బుదవారం నాడు ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడ లెనిన్ సెంటర్ పేరు మార్చి కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ పేరు పెట్టాలంటూ, లెనిన్ ను విదేశీయునిగా, లెనిన్ కు సంబంధమేంటంటూ రాష్ట్ర బిజెపికి నూతన అధ్యక్షునిగా ఎన్నికైన మాధవ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కార్మికవర్గం ఎక్కడున్నాసరే లెనిన్ తో సంబంధం ఉంటుందనేది జగమెరిగిన సత్యమన్నారు. ప్రపంచంలో మొట్టమొదటి కార్మికవర్గ నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన శక్తి లెనిన్ అని గుర్తు చేవారు. ప్రధాని నరేంద్రమోడీ విదేశాలకు వెళ్లి అవార్డులు తీసుకున్నప్పుడు మోడీ గురించి, ఆయన తీసుకున్న అవార్డులు గురించి బిజెపి నేతలు గర్వంగా చెప్పుకోలేదా? ఆయా అవార్డులు విదేశాలవి కాబట్టి తీసుకోబోమని బిజెపి నేతలు ఎందుకు చెప్పలేకపోయారంటూ నిలదీశారు. మోడీ విదేశాలు వెళ్లి అవార్డులు తీసుకోవచ్చుగానీ, ప్రపంచ కార్మికవర్గ నేత లెనిన్ కు ఇక్కడ సంబంధం



ఉండదా అంటూ ప్రశ్నించారు. పలు దేశాల్లో మోడీ అవార్డులు తీసుకునేటప్పుడు ఆయా దేశాలకు విదేశీయుడు కాదా అని ప్రశ్నిస్తున్నామన్నారు. కమ్యూనిస్టులంటే బిజెపి నేతలకు ఉన్న వ్యతిరేకతను మాధవ్ ఈ విధంగా వెళ్లగక్కారని అన్నారు. మాధవ్ వ్యాఖ్యలు అనాలోచితమైన వివన్నారు. అసంబద్ధమైనవనీ, అజ్ఞాన పూరితమైనవనీ, ప్రపంచ చారిత్రక పరిజ్ఞానమున్న ఎవరూ కూడా ఇలా మాట్లాడరని అన్నారు. ప్రపంచమంతా గ్లోబల్ విలేజ్ మాదిరిగా ముందుకు పోతున్న తరుణంలో బాధ్యతా యుత స్థానం చేపడుతున్న మాధవ్ ఇటువంటి వ్యాఖ్యలు చేయడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. సామాజిక పరిజ్ఞానమున్నవారు, ప్రజాతంత్ర వాదులెవ్వరూ దీనిని హర్షించరని అన్నారు. మొత్తం మీద బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తొలి ప్రయత్నంలోనే డక్ అవుట్ అయ్యారని అన్నారు.

## నూతన ఎస్సైని మర్యాద పూర్వకంగా కలిసిన వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు ముక్కెళ్ళ గిడ్డయ్య

**తుగ్గలి జులై 9(మనం న్యూస్):** తుగ్గలి మండలం నూతన ఎస్సైగా బదిలీపై వచ్చిన బాల నరసింహులును బుధవారం వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు ముక్కెళ్ళ గిడ్డయ్య మర్యాద పూర్వకంగా కలిసి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శాంతి భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.



# జూలై 16న శ్రీవారి ఆలయంలో అణివార ఆస్థానం

- సాయంత్రం పుష్పపల్లకీ
- జూలై 15న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుమల,జూలై 09మనం న్యూస్ :** తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో జూలై 15న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. జూలై 16వ తేదీన ఆణివార ఆస్థానం సందర్భంగా ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ.

సాధారణంగా సంవత్సరంలో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే తిరుమంజనం కార్యక్రమం సుమారు 5 గంటలపాటు కొనసాగనుంది. తిరుమంజనం కార్యక్రమం అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు ఆలయ అర్చకులు ఆగమోక్తంగా పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు.

అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు.

తిరుమంజనం కారణంగా మంగళవారంనాడు నిర్వహించే అష్టదళపాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది.



**జూలై 16న శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం**

తిరుమల శ్రీవారి ఆలయంలో జూలై 16వ తేదీన సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినం ఘనంగా జరుగనుంది.

**చారిత్రక నేపథ్యం :**

సాధారణంగా ప్రతి సంవత్సరం సౌరమానం ప్రకారం దక్షిణాయన పుణ్యకాలంలో కర్కాటక సంక్రాంతినాడు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. అయితే సౌరమానాన్ని అనుసరించే తమిళుల కాలమానం ప్రకారం ఆణిమాసం చివరి రోజున నిర్వహించే కొలువు కావడంతో ఆణివార ఆస్థానం అని పేరు. పూర్వం మహంతులు దేవస్థాన పరిపాలనను స్వీకరించిన రోజు అయిన ఈ ఆణివార ఆస్థానం పర్వదినంనాటి నుండి టీటీడీ వారి ఆదాయ వ్యయాలు, నిల్వలు తదితర వార్షిక లెక్కలు ప్రారంభమయ్యేవి. టీటీడీ ధర్మకర్తల మండలి ఏర్పడిన తరువాత వార్షిక బడ్జెట్ను మార్చి - ఏప్రిల్ నెలలకు మార్చారు.

**ఉత్సవ విశిష్టత :**

ఈ ఉత్సవం రోజున ఉదయం 7 గంటలకు బంగారువాకిలి ముందు గల ఘంటా మండపంలో సర్వభూపాల వాహనంలో ఉభయదేవేరులతో కూడిన శ్రీ మలయప్పస్వామివారు గరుత్మంతునికి అభిముఖంగా కొలువుకు వేంచేపు చేస్తారు. మరో పీఠంపై స్వామివారి సర్వసైన్యాధ్యక్షుడైన శ్రీవిష్వక్సేనులవారు దక్షిణాభిముఖంగా వేంచేపు చేస్తారు. ఈ ఉత్సవమూర్తులతో పాటు ఆనందనిలయంలోని మూలవిరాట్టుకు ప్రత్యేకపూజలు, ప్రసాదాలు నివేదిస్తారు.

**జీయ్యంగార్ల వస్త్ర సమర్పణ :**

తిరుమల పెద్ద జీయ్యర్ స్వామి పెద్ద వెండితట్టలో ఆరు పెద్ద పట్టువస్త్రాలను తలపై పెట్టుకొని మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా విచ్చేస్తారు. వీటిలో నాలుగింటిని మూలమూర్తికి అలంకరిస్తారు. మిగిలిన రెండు వస్త్రాలలో ఒకటి మలయప్పస్వామివారికి, మరొకటి విష్వక్సేనులవారికి అలంకరిస్తారు. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు తమ తలకు శ్రీవారి పాద వస్త్రంతో పరివట్టం(చిన్న పట్టుగుడ్డ) కట్టుకొని స్వామివారి ద్వారా బియ్యపు దక్షిణ స్వీకరించి 'నిత్యైశ్వర్యోభవ' అని స్వామివారిని ఆశీర్వదిస్తారు. ఆ తరువాత అర్చకులు తిరుమల పెద్ద జీయ్యర్ స్వామివారికి, చిన్న జీయ్యర్ స్వామివారికి, టీటీడీ తరఫున కార్యనిర్వహణాధికారికి 'లచ్చన' అను తాళపు చెవి గుత్తిని వరుస క్రమంలో కుడిచేతికి తగిలిస్తారు. హారతి, చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేసిన అనంతరం ఆ తాళపు చెవి గుత్తిని శ్రీవారి పాదాల చెంత ఉంచుతారు.

**పుష్ప పల్లకీపై ఊరేగింపు :**

ఆణివార ఆస్థానం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు అత్యంత శోభాయమానంగా అలంకరించిన పుష్పపల్లకీపై తిరుమల పురవీధుల గుండా ఊరేగుతూ భక్తులకు కనువిందు చేస్తారు.

**ఆర్జితసేవలు రద్దు :**

ఆణివార ఆస్థానం కారణంగా జూలై 16న కల్యాణోత్సవం, ఊంజల్సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

**విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు**

జూలై 15 మరియు జూలై 16 తారీఖుల్లో కోయిల్ ఆల్వార్ తిరుమంజనం మరియు ఆణివార ఆస్థానం ఉన్న కారణంగా ఈ రెండు రోజుల్లో విఐపి బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది.

ఈ కారణంగా వీఐపీ బ్రేక్ దర్శనానికి సంబంధించిన సిఫార్సు లేఖలు జూలై 14 మరియు జూలై 15 తారీఖుల్లో స్వీకరించబడవు.

భక్తులు ఈ అంశాలను గమనించి టిటిడి కి సహకరించవలసిందిగా కోరడమైనది.

## తిరుపతి జిల్లా చేనేత కార్మికుడికి అత్యుత్తమ పురస్కారం

- సంత్ కబీర్ అవార్డుకి ఎంపికైన వెంకటగిరి వాసి లక్కా శ్రీనివాసులు

**తిరుపతి కలెక్టరేట్,జూలై 09,మనం న్యూస్ :** సంత్ కబీర్ అవార్డు అనేది చేనేత వారసత్వాన్ని సజీవంగా ఉంచడంలో విలువైన కృషి చేసిన అత్యుత్తమ నేత కార్మికులకు ప్రదానం చేసే భారత ప్రభుత్వ పురస్కారం.



సాంప్రదాయ నైపుణ్యాలు, డిజైన్లపై జ్ఞానాన్ని వ్యాప్తి చేయడం ద్వారా గతం, వర్తమానం, భవిష్యత్తు మధ్య సంబంధాలను పెంపొందించడంలో అంకితభావం కోసం భారత ప్రభుత్వ వస్త్ర మంత్రిత్వ శాఖ 15వ శతాబ్దపు ఆధ్యాత్మిక కవి శ్రీ సంత్ సంత్ కబీర్ జ్ఞాపకార్థం దీనిని స్థాపించింది.

ప్రతి ఏడాది, వస్త్ర మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వము సంత్ కబీర్ అవార్డుల ఎంపిక కొరకు చేనేత వృత్తిలో విలువైన కృషి చేసిన అత్యుత్తమ నేత కార్మికుల వివరాలను సంభదిత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ విభాగాల ద్వారా ప్రతిపాదనలను తీసుకుని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత అవార్డ్ కి ఎంపికైన వారి వివరాలను అధికారికముగా తెలియపరుస్తారు,అలాగే ఈ ఏడాది 2024 మన రాష్ట్రము నుండి తిరుపతి జిల్లా కి చెందిన లక్కా శ్రీనివాసులు ఎంపికైనట్లు తిరుపతి జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి, ఆర్.రమేష్ ప్రకటనలో తెలిపారు. వెంకటగిరి మండలము ,బొప్పవరం గ్రామం, సాలి కాలనీకి చెందిన లక్కా శ్రీనివాసులు జందాని వెంకటగిరి చీరలు నేయడంలో ఎంతో ప్రావీణ్యం కలవారు, గతంలో కూడా ఇతనికి చేనేత రంగంలో విశిష్ట సేవలు అందించినదానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ స్థాయిలో వివిధ అవార్డ్ లు కూడా పొందాలని ఆ ప్రకటనలో తెలియజేశారు.

## బిగ్, జనతా క్యాంటిన్ లలో నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలి

- టిటిడి ఈవో జె. శ్యామలరావు

**తిరుమల,జూలై 09,మనం న్యూస్ :** తిరుమలలో శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు బిగ్, జనతా క్యాంటీన్లలో నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని టిటిడి ఈవో జె. శ్యామల రావు కోరారు. టిటిడి పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో గుర్తింపు ఉన్న హోటళ్ల నిర్వాహకులతో బుధవారం టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి ఈవో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ శ్రీవారి దర్శనం కోసం ప్రపంచ వ్యాప్తంగా భక్తులు వస్తుంటారని, వారికి సేవా దృక్పథంతో నాణ్యమైన ఆహార పదార్థాలు, పరిశుభ్రత, లాభాపేక్ష లేకుండా నిర్దేశించిన ధరలకు అందించాలన్నారు. తిరుమలలో బిగ్, జనతా క్యాంటిన్ల నిర్వహణ కోసం గత



నెల 23వ తేదీ నోటిఫిషన్ జారీ చేశారు. సదరు ఈవోఐ సంబంధించిన సందేహాలపై గుర్తింపు ఉన్న హోటళ్ల నిర్వాహకులు తమ ఆసక్తిని వ్యక్తం చేసేందుకు (ఉఇ)/ ప్రీ బిడ్ మీటింగ్ ను టిటిడి ఈవో జె. శ్యామల రావు, టిటిడి అదనపు ఈవో సిహెచ్. వెంకయ్య చౌదరి నిర్వహించారు. తిరుమలలో బిగ్, జనతా హోటళ్ల నిర్వహణలో నాణ్యత ప్రమాణాలు, పరిశుభ్రత పాటించాలని, లాభాపేక్ష లేకుండా నిర్దేశించిన ధరల ప్రకారం ఆహార పదార్థాలను అందించాలని వారిని ఈవో, అదనపు ఈవో కోరారు. నిర్ధారించిన నియమాలకు లోబడి బిగ్, జనతా క్యాంటిన్ లో కేటాయింపు ఉంటుందని ఈ సందర్భంగా చెప్పారు. ఈ సమావేశంలో బిగ్, జనతా హోటళ్ల నిర్వహణలో టెండర్ ప్రాసెస్ మరియు తదితర నియమ నిబంధనలను గుర్తింపు, ఆసక్తి ఉన్న హోటళ్ల నిర్వాహకులు నివృత్తి చేసుకున్నారు. హోటళ్ల నిర్వాహకులు పలు సందేహాలు వ్యక్తం చేయగా వాటిని టిటిడీ ఈవో, అదనపు ఈవో నివృత్తి చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎఫ్.ఏ.ఓ రవి ప్రసాదు, తిరుమల ఎస్టేట్ ఆఫీసర్ కె. వెంకటేశ్వర్లు, ఆసక్తి , గుర్తింపు ఉన్న పలు హోటళ్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్లను రద్దు చేయాలి

- కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి
- పని గంటలు తగ్గించాలి వేధింపులు ఆపాలి
- సార్వత్రిక సమ్మెలో కదం తొక్కిన కార్మికులు




**మదనపల్లి,జూలై 09, మనం న్యూస్ :** కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను యాజమాన్యానికి అనుకూలంగా ఉండే లేబర్ కోడ్లుగా మార్చే దుర్మార్గపు ఆలోచనలను ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం కార్మిక వర్గం దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా మదనపల్లెలో సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపాలిటీ, అంగన్వాడి, ఆశ వర్కర్స్, హమాలీ వర్కర్స్, పంచాయతీ వర్కర్స్, ఎలక్ట్రిసిటీ, బిఎస్ఎన్ఎల్, బ్యాంకింగ్ రంగం లోని తదితర కార్మికులు, ఉద్యోగులు దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని కదం తొక్కారు. సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం నుంచి బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఇప్పటివరకు 22 సమ్మెలు జరిగాయని, అయితే నేటి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ప్రత్యేకత ఉందన్నారు. కార్మికులను బానిసలుగా మార్చే కుట్ర దాగి ఉన్న లేబర్ కోడ్లను ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చి, యాజమాన్యానికి అనుకూలంగా ఉండే విధానాలను పెద్ద ఎత్తున కేంద్ర ప్రభుత్వం చొప్పిస్తోందని ఇందుకు నిరసనగా పెద్ద ఎత్తున గొంతు విప్పాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. కనీస వేతనాలు చట్టాన్ని రద్దుచేసి, సమ్మె హక్కును కాలరాస్తూ యజమానులకు అనుకూలమైన చట్టాన్ని కల్పించడమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పావులు కదుపుతోందని, ఇది చాలా దారుణమన్నారు. ఇందువల్ల యజమానుల గుప్పట్లోకి అన్ని హక్కులు వెళ్లిపోతాయని, వారు అనుకున్న సమయంలో సంస్థను మూసివేయొచ్చని, వారు అనుకున్న విధంగా కార్మికులకు వేతనాలు ఇవ్వవచ్చని, ఎప్పుడైనా సరే కార్మికులను తొలగించే వెసులబాటు ఉందని, పని గంటలు పెంచడం లాంటి ఎన్నో అనుకూల పరిస్థితులు యజమాన్యానికే అనుకూలంగా ఉంటాయన్నారు. కావున ఈ దుర్మార్గపు ఆలోచనలను కేంద్ర ప్రభుత్వం పక్కనపెట్టి కార్మిక వర్గ చట్టాలను యధావిధిగా కొనసాగించాలన్నారు. వ్యవసాయ కార్మికులను కూలీలుగా, వలస కూలీలుగా మార్చే పద్ధతి లేబర్ కోడ్ల వల్ల వస్తుందని, దీనివల్ల రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని, వ్యవసాయ కార్మికులను బానిసలుగా మార్చే పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఉన్న ప్రజానీకాన్ని బానిసలుగా మార్చే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. దేశ సంపదను ఆదాని, అంబానీలకు దోచి పెట్టి, ప్రజలను బిక్షగాలను చేసేందుకు లేబర్ కోడ్లు దోహదపడుతాయని మండి పడ్డారు. కార్మిక వర్గం ఉద్యోగులు అందరూ ఐక్యమై ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గపు ఆలోచనలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. దేశమంటే అంబానీ, ఆదానీలే కాదని కార్మికులు, కష్టజీవులు, రైతులు, వ్యవసాయ కూలీలు అందరూ దేశంలో భాగమేనని గుర్తు చేశారు. వీరికి కనీస వేతనాలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. నానాటికి ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ప్రజలు సైతం కార్మిక వర్గానికి మద్దతు ఇచ్చి, దేశ సంపద ప్రజలకే చేరేవిధంగా జరిగే ప్రజా ఉద్యమంలో భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు రాజేశ్వరి, మధురవాణి, బ్యాంక్ ఆఫ్ బరోడా రవి కిరణ్, ఇండియన్ బ్యాంక్ సిబ్బంది,గ్రామీణ బ్యాంకు సిబ్బంది, బ్యాంక్ ఆఫ్ బరోడా సిబ్బంది, సిఐటియు నాయకులు ప్రభాకర్ రెడ్డి, రామకృష్ణ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు జయమ్మ, సవిత, పంచాయతీ వర్కర్స్ నాయకులు గోపాల్, ఎలక్ట్రిసిటీ యూనియన్ నాయకులు నారాయణ, ఐటీయూసీ నాయకులు కృష్ణమూర్తి, అధిక సంఖ్యలో ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ వర్కర్స్, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

**అడుగడుగునా పోలీసు ఆంక్షలు**

కార్మిక వర్గం బుధవారం చేపట్టిన దేశవ్యాప్త సమ్మెకు అడుగడుగునా పోలీసులు ఆంక్షలు విధించారు. శాంతియుతంగా తమ గలాన్ని వినిపించేందుకు కార్మికులు చేపట్టిన శాంతి ర్యాలీని అడ్డుకునేందుకు పోలీసులు విశ్వ ప్రయత్నాలు చేశారు. సమ్మె కు అనుమతించాలని దరఖాస్తు చేయలేదని, తమను కాదని శాంతియుత ర్యాలీ చేస్తే అందరి పైన కేసులు బనాయిస్తామని బెదిరింపులకు దిగారు. దీంతో కొద్దిసేపు పోలీసులకు కార్మిక నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. చివరికి కార్మికులు అనుకున్న ప్రదేశం వరకూ కాకుండా కొంతమేర శాంతిర్యాలి చేపట్టి తమపై జరుగుతున్న అరాచకాలపై మండిపడ్డారు.

## రాజధాని అమరావతి నిర్మాణ స్ఫూర్తితో తుడా ను అభివృద్ధి చేస్తున్నాం

### తుడా పరిధిలో ప్రతి గ్రామానికి రోడ్లు, త్రాగునిరు, డ్రైన్స్ అందిస్తాం

### సమాజ అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులది కీలకపాత్ర

### తుడా చైర్మెన్ డాలర్స్ దివాకర్ రెడ్డి

**తిరుపతి,జూలై 09,మనం న్యూస్ :** రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి లోకేష్ బాబులు అహర్నిశలు శ్రమిస్తున్నారని వారి శ్రమలో భాగం పంచుకోవాలన్న సంకల్పంతో తాను తుడా చైర్మన్ గా బాధ్యతలు చేపట్టి తుడా పరిధిలో ప్రజలకు కావలసిన మౌలిక వసతుల కల్పనకు తన వంతు




కృషి చేస్తూ రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతున్నానని తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి అన్నారు. తుడా చైర్మన్ గా డాలర్స్ దివాకర్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత తుడా పరిధిలో లేవుట్ అప్రూవల్, భవన నిర్మాణాల అనుమతులు, అమలు తదితర అంశాల పై గతంలో ఎన్నడు లేని విధంగా రాష్ట్ర చరిత్రలో మొదటిసారి 4 మున్సిపాలిటీలు, 9 నియోజకవర్గాలు, 39 మండలాల ఎంపిడిఓ లు , 1100 పైగా గ్రామపంచాయతీల కార్యదర్శులకు అవగాహన సదస్సు బుధవారం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, తుడా వైస్ చైర్మన్ జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు, జిల్లా ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశి, డివిజనల్ పంచాయతీ ఆఫీసర్ సురేష్ నాయుడు, మున్సిపల్ డిప్యూటీ సిటీ ప్లానర్ మహబూబ్ ఖాన్,తుడా సెక్రటరీ శ్రీకాంత్, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తుడా సిటీ ప్లానింగ్ ఆఫీసర్ దేవీ కుమారి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పంచాయతీ పరిధిలో కార్యదర్శులు అక్రమ లేఅవుట్లు ఎలా గుర్తించాలి, ఎలా అనుమతులు ఇవ్వాలి. భవన నిర్మాణాల అనుమతులు తదితర అంశాలను కులం కుశంగా వివరించారు. అదేవిధంగా పంచాయితీ కార్యదర్శుల అనుమానలను నివృత్తి చేశారు.

ఈ సందర్భంగా తుడా చైర్మెన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుపతి నగరానికి శ్రీవారి దర్శనర్థం ప్రతిరోజూ లక్షలాదిమంది ప్రజలు వస్తున్నారని వారు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ప్రశాంతంగా దైవదర్శనం చేసుకొని సంతోషంగా తిరిగి వెళ్ళేవిధంగా అన్ని సౌకర్యాలు తుడా కల్పిస్తుందని స్పష్టం చేశారు.

సీఆర్డీఏ పరిధిలో రాజధాని అమరావతి నిర్మాణం సరవేగంగా జరుగుతోంది దానిని స్ఫూర్తిగా తీసుకొని తుడా పరిధిలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు మంత్రి లోకేష్ గారు కష్టపడుతున్నారని వారి కష్టంలో భాగం కావాలన్న సంకల్పంతో తుడా అభివృద్ధికి కష్టపడుతున్నామన్నారు.

గత పాలకులు తుడాను భ్రష్టుపట్టించారాని మండిపడ్డారు. తాను తుడా చైర్మెన్ అయ్యాక తుడా ను గాడిలో పెడుతున్నామని పేర్కొన్నారు. తుడా పరిధిలోని అన్ని గ్రామపంచాయతీలలో ప్రజలకు అవసరమైన త్రాగునీరు,రోడ్లు, డ్రైన్లు, కరెంటు సౌకర్యం ఏర్పాటు చేయడానికి తుడా కృషి చేస్తుందని చెప్పారు. అక్రమ లేవుట్స్ వలన క్రైమ్ రేటు పెరుగుతోందని, ప్రజలు అక్రమ లేఔట్స్ లో స్థలాలు కొని ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయితీ కార్యదర్శులు లేవుట్, భవన నిర్మాణాల అనుమతులు వాటి అమలు, తుడా నియమ నిబంధనలు తెలుసుకొని తుడా అభివృద్ధికి కృషి చేయాలనీ కోరారు. గ్రామపంచాయతీలు, మండలాలు,జిల్లాల అభివృద్ధిలో గ్రామపంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమైనదని వారి హోదాకు ఎలాంటి భంగం కలగకుండా చూసుకుంటామన్నారు.

తుడా వైస్ చైర్మన్ శుభం బన్సల్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమైనదని ప్రభుత్వ జీవోలను క్షుణ్ణంగా తెలుసుకుని వాటిని అమలు చేయాలని కోరారు. తుడా కు అదే విధంగా పంచాయతీ కార్యదర్శుల మధ్య ఉన్న కమ్యూనికేషన్ గ్యాప్ ను పూరిస్తామని చెప్పారు. తుడా భివృద్ధికి పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని కోరారు.

## మదనపల్లె జననేత ఎమ్మెల్యే షాజహాన్‌కు అడుగడుగునా మంగళ హారతుల స్వాగతం

### సుపరిపాలనలో తొలి అడుగుకు విశేష స్పందన

**మదనపల్లి,జూలై 09, మనం న్యూస్ :** మదనపల్లె పట్టణం 1వ వార్డు అనుపగుట్టలో బుధవారం జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా అక్కడి ప్రజలు అఖండ స్వాగతం పలికారు...తమ సమస్యలను ఆలకించే నేతంటూ ప్రసంశలు గుప్పించారు...ఎప్పుడు తమ సమస్యలపై ఆయన్ను కలిసినా తమకు పెద్దన్నలా ఆదరణ చూపుతారని కొనియాడారు. కాగా ఈ నెల రెండో తారీఖు



నుంచి పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు మదనపల్లెలో దిగ్విజయంగా సాగుతోంది.తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి చేసిన అభివృద్ధి మరియు పథకాల గురించి ఇంటింటికి వెళ్లి కరపత్రాన్ని అందజేసి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి బాగోగులు అడిగి తెలుసుకుని సమస్యలు ఏమున్నాయని అడిగి తెలుసుకుని సమస్యలు ఉంటే తక్షణమే అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే షాజహాన్ బాషా కృషి చేస్తుండటం ప్రజల మన్ననలు అందుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.


## శ్రీసిటీని సందర్శించిన కేంద్ర గృహనిర్మాణ శాఖ కార్యదర్శి శ్రీనివాస్ బృందం

- కార్మికుల గృహ నిర్మాణాలు, సుస్థిర పట్టణాభివృద్ధికి హామీ



**తిరుపతి,జూలై 09,మనం న్యూస్ :** కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ కటికితల, ఆ శాఖ సంయుక్త కార్యదర్శి (అమృత్ పథకం) ఇషా కాలియా, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ ఎన్.మౌర్య, సాంకేతిక సలహాదారు రోహిత్ కక్కర్ తో కలసి బుధవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ ఆయనకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రణాళిక, ప్రస్థానం, పారిశ్రామిక ప్రగతి గురించి వివరించారు. చర్చల సందర్భంగా, శ్రీసిటీలో అభివృద్ధి చెందుతున్న సామాజిక వసతులపై ప్రత్యేక ప్రదర్శన ఇచ్చారు. గృహ సముదాయాలు, విద్యా వసతులు, షాపింగ్ కేంద్రాలు, ఇతర కీలక సౌకర్యాల గురించి హైలైట్ చేశారు. అలాగే ఇక్కడ అమలు చేస్తున్న సమర్థవంతమైన నీటి వనరుల నిర్వహణ, మురుగునీటి రీసైక్లింగ్, ఘన వ్యర్థాల నిర్వహణ, హరితహిత చర్యలు, ఇతర సుస్థిరత కార్యక్రమాలను వివరించారు. టౌన్షిప్ ల అభివృద్ధి ద్వారా వాక్ టు వర్క్ ఆవశ్యకతను ప్రస్తావిస్తూ, ఇందుకోసం అవసరమైన సహకారం అందించాలని కార్యదర్శికి విన్నవించారు. ప్రస్తుత పారిశ్రామిక కార్యకలాపాలు, భవిష్యత్తు విస్తరణ వ్యూహాలు, మౌళిక సదుపాయాలు, నివాస గృహాల డిమాండ్ ముఖ్యంగా డార్మిటరీలు మరియు తక్కువ ఆదాయ వర్గాలకు సరసమైన అద్దె గృహాలపై శ్రీనివాస్ లోతైన చర్చల్లో పాల్గొన్నారు. ఇతర పారిశ్రామిక ప్రాంతాలలో విజయవంతమైన గృహ ప్రణాళికల నమూనాలను అధ్యయనం చేయాలని, కేంద్ర గృహ నిర్మాణశాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా వినూత్న ప్రతిపాదనలతో ముందుకు రావాలని ఆయన శ్రీసిటీ బృందానికి సూచించారు. అనంతరం, పారిశ్రామిక ప్రతినిధులతో చర్చల్లో పాల్గొన్న ఆయన, ప్రధానంగా మహిళా ఉద్యోగులకు చౌకధర అద్దె గృహాలను అందుబాటులోకి తేవడంలో ప్రభుత్వ సహకారం, ఇతర అంశాలపై చర్చించారు. సమగ్ర పట్టణాభివృద్ధి మరియు గృహ నిర్మాణాల విషయంలో మంత్రిత్వ శాఖ నుండి పూర్తి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా శ్రీనివాస్ హామీ ఇచ్చారు. కేంద్ర గృహనిర్మాణశాఖ ఉన్నతాధికారులు శ్రీసిటీ పర్యటనకు రావడం తాము గౌరప్రదంగా భావిస్తున్నామని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు. వారి విలువైన సూచనలు శ్రీసిటీ అభివృద్ధికి మరింత దోహదపడతాయని, ముఖ్యంగా సామాజిక మౌళిక సదుపాయాలు, గృహ వసతులను మెరుగుపరచడంలో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రతినిధులతో చర్చల ద్వారా మౌళిక సదుపాయాలు మరియు కార్మిక నివాసాలకు సంబంధించి వారు తమ అభిప్రాయాలను పంచుకునే అవకాశం దక్కిందన్నారు. పర్యటనలో భాగంగా కేంద్ర కార్యదర్శి శ్రీనివాస్ శ్రీసిటీ పరిసరాలతో పాటు ఆల్స్టామ్ పరిశ్రమలో తయారు అవుతున్న మెట్రో కోచ్ ల తయారీ విధానాన్ని పరిశీలించారు. అక్కడ పరిశ్రమ పనితీరు, ఇతర పారిశ్రామిక మౌళిక వసతులను పరిశీలించారు. అద్భుత ప్రణాళిక, కార్యాచరణతో రూపుదిద్దుకున్న శ్రీసిటీ పారిశ్రామిక మరియు ఆర్థిక కేంద్రాన్ని సందర్శించడం ఆనందంగా ఉందంటూ శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఇక్కడి ప్రజలు, ఈ ప్రాంతం, దేశ శ్రేయస్సుకు ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. శ్రీసిటీ మరింత వృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తూ, అవసరమైన సహాయ సహకారాలను తమ మంత్రిత్వ శాఖ ద్వారా అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యదర్శితో పాటు ఇతర సీనియర్ అధికారులు, సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి పాల్గొన్నారు.

## లోపల్లోకి.. లోలోకి



భళ్లున తెల్లవారిందో లేదో
ఘాతుకాల పుటలు కళ్లముందు
శత్రువెవరో మిత్రుడెవరో
బంధువెవరో రాబంధువెవరో
రంగులు మార్చుకుంటున్నలోకం

రక్తసంబంధాలు రాకాసి గుళ్లాయే
మనిషి తనమంతా మృగ్యమై పోతుండే
అనుబంధాలన్ని పేక మేడల్లా
కూలిపోతుండే కుల్లిపోతుండే
మాయదారి వైరస్లు మాటు వేసి
కాటువేస్తుండే..కబలిస్తుండే..

బ్రతుకంతా అర్థికమై
వస్తువుల్ని ప్రేమించే వాడు
మనిషినెట్లా ప్రేమిస్తాడు
మనసునెట్లా ప్రేమిస్తాడు

సమాజమంతా సచ్చుబడి
యాంత్రికమవుతున్న సందర్భంలో
ప్రేమలు ఒఠీ మాటలే
విలువలు పేక కోటలే

ఎవరికీ ఎవరూ ఏమీకారు
అనే జీవన వైరాగ్యంలోకి
లోపల్లోకి లోలోకి ఆసాంతం
మనమంతా జారిపోతున్న వేళ
ఏదో వెంటాడుతున్న వేటాడుతున్న
కల్లోల కర్కశ లోకంలో ఉన్నందుకు
ఈ రోజే రేపటి గురించి భయం

**- డా. కటుకోఝ్వల రమేష్**
9949083327

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**- ఎడిటర్**

# క్లీన్ ఎనర్జీ భవిష్య అవసరాలకు పరిష్కారం



శక్తి వివిధ రూపాల్లో లభిస్తుంది. ప్రపంచంలోను,భారత దేశంలోను అనేక శక్తి వనరులు నిక్షిప్తమై ఉన్నాయి. ఇందులో కొన్ని శక్తి వనరులు తరిగి పోతున్నాయి. తరిగే పోతున్న శక్తి వనరులను పొదుపుగా వినియోగించు కుంటూ, పునరుత్పాదక శక్తి వనరులపై దృష్టిసారించక పోతే భవిష్యత్తులో ఇంధన కొరత తీవ్రతరమై, అనేక విపత్కర పరిణామాలు సంభవించే అవకాశముంది. జూలై10వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా 'గ్లోబల్ ఎనర్జీ ఇండిపెండెన్స్ డే' గా జరుపుకుంటారు. సాంప్రదాయ ఇంధన వనరుల వినియోగం తగ్గించి, ప్రపంచాన్ని పునరుత్పాదక ఇంధన వనరులపైన, క్లీన్ ఎనర్జీ పైన దృష్టి కేంద్రీకరించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకతను చాటి చెప్పి, ఇంధన రంగంలో స్వయం స్వావలంభన సాధించడమే గ్లోబల్ ఎనర్జీ ఇండిపెండెన్స్ డే ముఖ్యోద్దేశ్యం. ఈ సమస్త ప్రపంచానికి నేడు ఇంధనం అనేది అత్యంత ప్రధానమైన శక్తి వనరుగా అవతరించింది. ఇంధనం లేకపోతే ప్రపంచ జీవన గమనం స్తంభించి పోతుంది. ఇటీవల ఇజ్రాయిల్- ఇరాన్ మధ్య జరిగిన సంఘర్షణ కాల్పుల విరమణతో తాత్కాలికంగా సర్దుమణిగింది. ఇరు దేశాల మధ్య పూర్తి స్థాయి యుద్ధం జరిగి, ఇరాన్ గనుక హార్మూజ్ జలసంధిని మూసివేసి ఉంటే భారత్ తో సహా పలు దేశాలు చమురు కొరతతో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొని ఉండేవి. ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నం కాకుండా భారత్ వంటి దేశాలు ఇంధన రంగంలో స్వయం సంవృద్ధి సాధించాలి. పునరుత్పాదక ఇంధన వనరుల వాడకం పెంచాలి.ప్రజల అవసరాలు పెరుగుతున్నాయి. పెరిగిన అవసరాలకు తగ్గట్టుగా అన్ని సౌకర్యాలు ప్రజలకు సమకూరడం లేదు. ఒకప్పుడు విలాసాలుగా పేర్కొనే వస్తువులు కూడా నేడు అత్యవసరాలుగా మారిపోయాయి. ఎ.సిలు,ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు పనిచేయకపోతే జన జీవనమే అస్తవ్యస్తమైపోయే పరిస్థితులు దాపురించాయి. నగరాలతో పాటు,గ్రామీణ ప్రాంతాల్లో కూడా వీటి అవసరం పెరిగిపోయింది. వీటి నిర్వహణకు పెద్ద మొత్తంలో విద్యుచ్ఛక్తి అవసరం. ఈ విద్యుత్ తయారీకి బొగ్గు,నీరు ప్రధానం. సాంప్రదాయ ఇంధన వనరులు తరిగిపోతున్న నేపథ్యంలో వీటికి ప్రత్యామ్నాయ ఇంధన వనరులను వినియోగించవలసిన ఆవశ్యకత ఏర్పడింది. తరగని ఇంధన వనరులకోసం అన్వేషణ జరగాలి. ప్రకృతి లో సహజసిద్ధమైన ఇంధనం 'సౌరశక్తి' ద్వారా లభిస్తుంది. సౌరశక్తి కాలుష్య రహితమే కాకుండా, నేటి విద్యుత్ కొరతను అధిగమించడానికి,ఇతర అవసరాలకు వినియోగ పడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడిప్పుడే సాంప్రదాయేతర ఇంధన వనరుల వాడకంపై అవగాహన పెరుగుతున్నది. దశాబ్ద కాలం ముందు ప్రపంచం మేల్కొని ఉంటే ఇంధన సంక్షోభ సమస్య ఏర్పడి ఉండేది కాదు. ఏ దేశమైనా అభివృద్ధి బాటలో పయనించాలన్నా, అందరికీ ఉపాధి అవకాశాలు కావాలన్నా మనకు ఆయా దేశాల్లో పారిశ్రామిక,సాంకేతిక,రవాణా,వ్యవసాయ, సేవా రంగాలలో విప్లవాత్మక



మార్పులు రావాలి. ఈ రోజుల్లో ప్రతీ రంగం ఒకదానితో మరొకటి ముడిపడి ఉంది. ప్రతీ రంగాన్ని ముందుకు నడిపించడానికి ఉపయోగపడేది ఇంధనం. మండటం వలన శక్తి నిచ్చే ఇంధనం పైనే మన అవసరాలన్నీ ఆధారపడి ఉన్నాయి. ఈ అవసరాలను గుర్తించే మన శాస్త్రవేత్తలు అనేక పరిశోధనలు జరిపి మనకు విభిన్న రకాలైన ఇంధన వనరులను వినియోగం లోకి తెచ్చారు. వారి పరిశోధనల పర్యవసానమే అన్ని రంగాలు ముందంజలో దూసుకుపోతున్నాయి. పెరుగుతున్న ప్రపంచ జనాభాకు కొంత వరకైనా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు, లారీలు, బస్సులు,రైల్వేలు, వైమానిక,నావికారంగం ..ఒకటేమిటి సర్వ వ్యవస్థలు ఇంధనం మీదనే నడుస్తున్నాయి. ఇంధన వనరులు లేకపోతే ప్రపంచం ఏమైపోతుందో ఊహకందని విషయం. అయితే క్రమేపీ మనం వాడుతున్న ఇంధన వనరులు తరిగిపోవడమే కాకుండా పలు రకాల పర్యావరణ సమస్యలను తెచ్చిపెట్టాయి. వాతావరణ సమతుల్యం దెబ్బతిన్నది. కలుషిత ఉద్గారాల వల్ల గాలి కాలుష్యం, జల కాలుష్యం జరిగి మానవుడు రోగాల పాలవుతున్నాడు. భూతాపం విపరీతంగా పెరిగిపోయింది. ప్రపంచ మంతా' గ్లోబల్ వార్మింగ్' పై గగ్గోలు పెడుతున్నది. చెట్లను నరికి,వాటిని కూడా ఇంధనంగా వాడడం వలన గాలిలో అవాంఛనీయ వాయువులు పెరిగిపోయాయి. మనం పీల్చే గాలి స్వచ్ఛతను కోల్పోయింది.ప్రాణాధార ఆక్సిజన్ పరిమాణం తగ్గిపోయింది. జలకాలుష్యం వలన తలెత్తిన ఇబ్బందులను పరిష్కరించడానికి తాగునీటిని శుద్ధి చేసే యంత్రాలొచ్చాయి.మన అవసరాలను ఆధారం చేసుకుని, తాగునీరు కొంతమందికి ప్రధాన ఆదాయ వనరుగా అంగడి సరుకుగా మారిపోయింది. ఇక ముమ్ముందు నీటి వలే గాలి కూడా పెద్ద వ్యాపారంగా మారుతుందనడంలో సందేహం లేదు. సమీప భవిష్యత్‌లో నీటి శుద్ధి యంత్రాల వలే గాలిశుద్ధి ప్లాంట్లు కూడా ఆవిర్భవించక తప్పదు. భవిష్యత్తులో ఎదురయ్యే ఇంధన వనరుల సమస్యను అధిగమించడానికి, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వాడకం తప్పని సరి. పలు దేశాలు ఇప్పుటికే పునరుత్పాదక ఇంధనాల (రెన్యూవబుల్ఎనర్జీ)ను ఉపయోగించి విద్యుదుత్పత్తి చేస్తున్నాయి. ఆస్ట్రేలియా లాంటి దేశాలు విద్యుత్‌తో నడిచే వాహనాలను పూర్తిగా వినియోగం లోకి తెచ్చి, శిలాజ ఇంధనాలైన పెట్రోలియం ఉత్పత్తుల ద్వారా నడిచే వాహనాలను అరికట్టి, కార్బన్ డై ఆక్సైడ్,మీథేన్ లాంటి ఉద్గారాల విడుదలకు కొంతవరకు అడ్డుకట్ట వేయడం జరిగింది.

సాంప్రదాయ ఇంధన వనరుల వినియోగంలో దూకుడు మీదున్న అమెరికా కూడా బయో ఇంధనాలవాడకం పై దృష్టి పెట్టడం ముదావహం. భూతాపం అనేది మిథ్యగా భావిం చిన అమెరికా అధ్యక్షుడు క్లీన్ ఎనర్జీ వాడకాన్ని కాకుండా శిలాజ ఇంధనాలను ప్రోత్సాహించడం దురదృష్టకరం. శిలాజ ఇంధనాలు కూడా ప్రకృతిసిద్ధంగా ఏర్పడినవే. ఇవి ఏర్పడడానికి లక్షలాది సంవత్సరాలు పట్టింది. ప్రపంచ అభివృద్ధి రథచక్రాల నడక ఆగిపోక తప్పదు. రాబోవు విపత్కర పరిణామాలపై దృష్టి పెడుతున్నాయి. అయితే ఈ కృషి సరిపోదు. ఒక సారి వినియోగానికే తప్ప, పునరుత్పత్తికి, పునర్వినియోగానికి పనికిరాని సాంప్రదాయ ఇంధన వనరుల వినియోగాన్ని తగ్గించి, సౌరశక్తి,పవన శక్తి, తరంగ శక్తి వంటి కాలుష్య రహితమైన సాంప్రదాయేతర పునురుత్పాదక ఇంధనాలపై దృష్టి సారించాలి. బయో ఇంధనాల వాడకం వలన కూడా చాలావరకు హానికారక ఉద్గారాల శాతాన్ని తగ్గించవచ్చు. చైనా, ఆస్ట్రేలియా, ఇండియా వంటి దేశాల్లో బొగ్గు నిక్షేపాలు అధికంగా ఉన్నాయి.ఖతార్,ఇరాన్, అమెరికా,రష్యా దేశాల్లో సహజ వాయు నిక్షేపాలు అధికం. గల్ఫ్ దేశాలు ఆర్థికంగా ముందంజలో ఉండడానికి ప్రధానమైన కారణం అక్కడ

ఇబ్బడి ముబ్బడిగా ఉన్న చమురు నిక్షేపాలే కారణం. అయితే భవిష్యత్తులో ఎదురయ్యే ప్రమాదాలను ఊహించి, తరిగిపోయే ఇంధన వనరులను త్యజించి కాలుష్యరహితమైన ఇంధన వనరులపై దృష్టి సారించాలి.భారతదేశంలో అపారమైన బొగ్గు నిక్షేపాలు, చమురు నిక్షేపాలు ఉన్నాయి.అయితే వీటిని వెలికి తీసి, ఉత్పత్తి చేయడం తలకుమించిన భారం, వ్యయంతో కూడుకున్న వ్యవహారం. జార్ఖండ్ ఒరిస్సా,బెంగాల్,తెలంగాణా వంటి రాష్ట్రాలలో బొగ్గు నిక్షేపాలు అధికంగా ఉండగా, గుజరాత్,అస్సాం,త్రిపుర వంటి రాష్ట్రాలలో సహజ వాయు నిక్షేపాలు అపారంగా ఉన్నాయి. అయినప్పటికీ మన దేశం సౌరశక్తి, వాయుశక్తి ఆధారిత విద్యుత్ పై దృష్టి కేంద్రీకరించడం శుభ పరిణామం.సాంప్రదాయ ఇంధన వనరులకు స్వస్తి చెప్పి, సాంప్రదాయేతర ఇంధన వనరులపై ప్రత్యేక వహించాలి. అన్నింటికంటే సౌరశక్తిని విద్యుత్‌గా మార్చడం శ్రేయస్కరం.ఇది కాలుష్య రహితం, పర్యావరణ సంరక్షణకు ఉత్తమమైన ఇంధన వనరు 'సౌరశక్తి'. చైనా,అమెరికా,భారత్‌ల తర్వాత శిలాజ ఇంధనాల వినియోగంలో రష్యా,జపాన్,ఇరాన్,సౌదీ అరేబియా, దక్షిణ కొరియా ఇండో నేషియా, కెనడా, యు.కె లు పోటాపోటీగా ముం దుకు సాగుతున్నాయి. జంతువుల, మొక్కల వ్యర్థాల నుండి ఉత్పత్తి అయ్యే ఇంధనాన్ని బయోమాస్ ఎనర్జీ అంటారు. ఇది కూడా పునరుత్పాదక ఎనర్జీ. పునరుత్పాదక శక్తి వనరులను వినియోగించే కొద్దీ తిరిగి భర్తీ చేయడతాయి. పునరుత్పాదక శక్తి వనరులతో వాతావరణంలో గ్రీన్ హౌస్ వాయువులను తగ్గించి, కాలుష్యాన్ని అరికట్టవచ్చు. క్లీన్ ఎనర్జీ వలన కర్బన ఉద్గారాల విడుదలను తగ్గించి, వాతావరణంలో అవాంఛనీయ పరిణామాలను అరికట్టి, అధిక ఉష్ణోగ్రతలను నివారించి, పర్యా వరణాన్ని పరిరక్షించి, సకల జీవరాశుల మనుగడకు అను కూలమైన పరిస్థితులను ఈ భూమండలంపై నెలకొల్ప వచ్చు అప్పుడే జీవ సమ తుల్యత, జీవ వైవిధ్యం ధరిత్రిపై సుసాధ్య మవుతుంది. సహజ ఇంధన వనరుల స్థానంలో చౌకగా లభించే ప్రత్యామ్నాయ ఇంధనాలను వినియోగించాలి. శిలాజ ఇంధన వనరుల లభ్యత ఆందోళన కరమైన స్థితికి చేరుకుంటున్న నేపథ్యంలో భవిష్య పరిణామాలను ఆకళింపు చేసుకుని సాంప్రదాయేతర ఇంధన వనరుల వాడకాన్ని పెంచాలి.'సౌరశక్తి' వినియోగమే ప్రస్తుత ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ఏకైక పరిష్కారం.

**- సుంకవల్లి సత్తిరాజు**
9704903463

# బరువైన బాల్యం - ప్రగతికి అవరోధం



లేత చేతులు కంకర రాళ్లు కొడుతూ, బట్టీల్లో ఇటుకలు కాలుస్తున్నాయి. పాలు కారే వయసు ప్రమాదకర పరిశ్రమల్లో, వెట్టి చాకిరీ వలలో చిక్కుకుపోయి మగ్గిపోతున్నది.

బాల కార్మికులు అంటే పిల్లలను పాఠశాల విద్యకు దూరం చేసి పిల్లల బంగారు బాల్యాన్ని, సామర్థ్యాన్ని, సంతోషాన్ని, ఆత్మ గౌరవాన్ని హరించి వేసి శారీరకంగా, మరియు మానసిక పెరుగుదలకు హాని కలిగించడం. ఇది మన సమాజానికి సిగ్గుచేటు. ప్రతిబిడ్డ ఏ మోసానికి గురికాకుండా తన బాల్యాన్ని ఆస్వాదించడమే నిజమైన బాల్యం. జాతీయ బాలల హక్కుల కమిషన్ ప్రకారం 14 సంవత్సరాల లోపు పిల్లలు వారి వయసుకు తగని శారీరక, మానసికంగా హాని కలిగించే పనులకు దూరంగా ఉండాలి. బాల కార్మిక వ్యవస్థ నేడు ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న అంతర్జాతీయ ఆర్థిక, సామాజిక సమస్య. ఇది భవిష్యత్ తరాలకు పెను సవాలుగా మారనుంది.

బాల కార్మిక వ్యవస్థనిర్మూలన కోసం పలు చట్టాలు ( బాల కార్మిక నిషేధ చట్టం 1986,1988, గనుల చట్టం 1952, జువైనల్ జస్టిస్ ఆఫ్ చిల్డ్రన్ యాక్ట్ 2015, విద్యా హక్కు చట్టం 2009, సమానత్వపు హక్కు ఆర్టికల్ 14, ఆర్టికల్ 21 లో వ్యక్తిగత జీవించే హక్కు, ఆర్టికల్ 21ఏ, ఆర్టికల్ 24 ) రక్షణ చట్రాలుగా ఉన్నప్పటికీ ఈ సమస్య ఇంకా అంతం కాకపోవడం అత్యంత విచారకరం.ఐ ఎల్ ఓ లెక్కల ప్రకారం దాదాపు 160 మిలియన్ల పిల్లలు ప్రపంచవ్యాప్తంగా బాల కార్మికులుగా పనిలో ఉన్నారు. ఇందులో 70% వ్యవసాయం, ఇంటి పనులు, వస్త్ర పరిశ్రమ, ఫుడ్ ప్రొడక్ట్స్, రవాణా మొదలగు రంగాల్లో పనిచేస్తున్నారు. 30% కర్మా గారాలు, గాజు, రంగులు, టపాసుల తయారీ, గనుల వంటి ప్రమాదకర రంగాల్లో పనిచేస్తున్నారు. ఈ సమస్య గ్రామీణ ప్రాంతాల్లో మరీ ఎక్కువగా కనబడుతుంది. సబ్ సహారా ఆఫ్రికాలో పిల్లలు బాల కార్మికులుగా ఎక్కువగా ఉన్నారు. 2030 నాటికి దీని తీవ్రత ఎక్కువ అయ్యే అవకాశం ఉందని యూనిసెఫ్ అంచనా. ఉదర పోషణార్థం, కనీస అవసరాల కోసం అనివార్య పరిస్థితుల్లో బాలలు కార్మికులుగా అరకొర వేతనాలతో, అత్యంత దయనీయ స్థితిలో దుర్భర జీవితాలు గడుపుతున్నారు.

**జీవన వనరులుగా**

పిల్లలు తెచ్చే డబ్బు పేద కుటుంబాలకు జీవనాధారం. తల్లిదండ్రులు పిల్లలను నమ్మకమైన ఆదాయ వనరుగా పరిగణించి బలవంతంగా పనులకు ప్రోత్సహిస్తున్నారు. పిల్లలు క్రమేపి స్వతంత్రంగా ఉత్పాదక వనరుగా పరిణితి చెందుతూ ఆయా పనుల్లో స్థిరపడి పోతారు. ఇది తక్షణ ఆదాయానికి ప్రాధాన్యత ఇవ్వవచ్చు కానీ ఇది పేదరిక చట్రాన్ని శాశ్వతంగా చేస్తుంది. పేదరికం, నిరక్షరాస్యత ఏకైక అతిపెద్ద కారణం. తల్లిదండ్రుల అనారోగ్య పరిస్థితి, అధిక సంతానం, ప్రాథమిక విద్య అందుబాటులో లేకపోవడం,



పట్టణీకరణ, వలసలు, ఈ పరిస్థితికి దారి తీస్తాయి.దారిద్ర రేఖకు దిగున ఉన్న పేదరిక కుటుంబాలు కొనుగోలు శక్తి స్థాయి లేకపోవడం వలన పిల్లలు బాండెడ్ లేబర్ గా మారుతున్నారు.

**సమస్యల ఎదురీత**

పిల్లలు శ్రమ వల్ల బాల్యం లోనే శక్తిని కోల్పోతారు. అనేక సమస్యలు చుట్టుముట్టి ఆ పసి హృదయాలను కలవరపెడతాయి. దీనివల్ల పిల్లలు శారీరకంగా, మానసికంగా మెరుగైన స్థితిలో ఎదగలేరు. కీలక దశలో చదువులు కోల్పోవడం ద్వారా భవిష్యత్ నిర్మాణం కష్టతరమవుతుంది. సామాజిక అనుబంధాల పట్ల, వారి భావోద్వేగ శ్రేయస్సు కోల్పోతుంది.

ఇది సామాజిక విచ్ఛిన్నతకు గురిచేసి తరతరాల పేదరికానికి దారి తీస్తుంది. ప్రపంచవ్యాప్తంగా పోటీ పడటానికి, అభివృద్ధి లక్ష్యాలను చేరుకోలేక దేశ భవిష్యత్ పై తీవ్ర ప్రభావం చూపుతుంది.బాలల విషయంలో ప్రతి క్షణం విలువైనదే. పాఠశాల జీవితంలో ఏ ఒక్క రోజు పనిలోకి పోయినా విలువైన జీవితాన్ని కోల్పోయినట్టే లెక్క. అనధికార రంగాలైన హోటళ్లు, ఇంటి పనులు, వ్యవసాయ రంగాల్లో పిల్లల శ్రమను గుర్తించడం కష్టతరమవుతున్నది. బీహార్, జార్ఖండ్, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఇది మరింత తీవ్రం. తల్లిదండ్రులకు ఉపాధి అవకాశాలను కల్పించడం ద్వారా కుటుంబాదాయం పెంచడం చేయాలి.

**సమాజ బాధ్యత**

పిల్లలకు బాల్య దశలో చదువులు, ఆటలు, ఆరోగ్యం, ప్రేమ లభించేలా చేయాలి. పేదరిక పిల్లలతో దేశం పురోగతి సాధించలేదు. పిల్లలు జాతి సంపద అని, భావి భారత నిర్మాతలని గుర్తెరగాలి. పిల్లలు పనిముట్లు వదిలి పుస్తకాలు పట్టాలి. కలలు కనే హక్కు కలిగి ఉండాలి. బాల కార్మిక వ్యవస్థను తగ్గించడానికి విద్య ఒక అద్భుతమైన నిరూపిత వ్యూహం. పేదరిక చట్రాన్ని విచ్ఛిన్నం చేయగల శక్తివంతమైన ఆయుధం.

స్థానిక సంఘాలు,వర్క్ షాపుల ద్వారా, ఎన్జీవోలు ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి. 'ఓ చిరుతల్లారా మీదే, మీదే సమస్త విశ్వం, మీరే లోకపు భాగ్య విధాతలు' అన్న మహాకవి శ్రీశ్రీ మాటలు నిజం కావాలి. 'బంగారు బాల్యం నా హక్కు' అనే నినాదం ద్వారా బాల కార్మిక శ్రమ రహిత భారత్ ను నిర్మించాలనే, దృఢ సంకల్పంతో ముందుకు వెళదాం.

**- వెంకటరమణ గిలకత్తుల**
98668 78769

## ఎందరో కన్నతల్లుల దీవెన ..తల్లికి వందనం

రాష్ట్రవ్యాప్తంగా తల్లికి వందనం పథకం ద్వారా ఎందరో కన్న తల్లులకు ఆనందం కలిగించింది. ముఖ్యంగా నిరుపేద కుటుంబాలు ఈ పథకం ద్వారా విద్యా విలువలు కాపాడుకోవడం కోసం మరింత వెలుగులు నింపాయి. ఈనెల 10 వతేది రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు పుట్టపర్తికి సమీపం లో కొత్త చెరువు వస్తున్న నేపథ్యంలో ఈ పథకం ఎందరో కన్న తల్లులకు మేలు చేకూరుస్తుందని తల్లుల అభిప్రాయం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తల్లికి వందనం పథకం ద్వారా లక్షల అనేకమంది తల్లులకు వారి వారి ఖాతాలో నగదు జమ చేశారు తల్లికి వందనం సాయం బహుళ ప్రాచుర్యం పొందినది. పేద కుటుంబాలకు న్యాయం జరిగేలా. అర్హులైన వారికి అందరికీ ఈ పథకం అందేలా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు అన్ని చర్యలు చేపట్టడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 10 వ తేదీ రాయలసీమలోని సత్యసాయి జిల్లాకు విచ్చేసి తల్లికి వందనం పథకం ద్వారా సహాయం పొందిన తల్లులతో ఆయన మాట్లాడతారు. తల్లికి వందనం పథకం చిన్నారుల విద్యా విలువలు కాపాడడం కోసం సాయం చేయడం గొప్ప విషయం అని పలువురు కన్నతల్లులు తల్లికి వందనం పథకం నిజంగా ఒక వరం అని చెప్పాలి.. అని పేర్కొన్నారు. ఈ పథకం ఆయా కన్నతల్లుల అనుభవాలను అభిప్రాయాలను ఈ సభలో తల్లికి వందనం పథకం ఎంతో గొప్పదని గిరిజన తండా కు చెందిన మహిళలు సైతం ప్రసూసించడం జరిగింది. తల్లికి వందనం పథకం గొప్పగా కూటమి తెలుగుదేశం ప్రభుత్వం సాధించిన తొలి విజయం గా పేర్కొనాలి. ప్రయివేటు చదువులతో ధీటుగా పిల్లలను చదివించి వారిని నేటి బాలలే రేపటి పౌరులు గా తీర్చి దిద్దడం లో కృషి చేయడానికి తెలుగుదేశం ప్రభుత్వం అమలు పరచిన అద్భుతమైన పథకం తల్లికి వందనం అని చెప్పాలి. అందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యత వహించడం విశేషం.ఈ పథకం అమలు చేయడం లో అహర్నిశలు కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు నారా లోకేష్ అభినందనీయులు.

**- ఎల్. ప్రఫుల్ల చంద్ర**
6300546700

## విద్యార్థిలోకానికి అండదండ ఎబివిపి ఎజెండా

క్షణం క్షణం భరతమాతకై సమర్పించే గొప్ప గుణం
ప్రకాశ్ బహేల్ మేధస్సుతో జనించిన స్వప్నం
జ్ఞానం ,శీలం,ఏకత తన మార్గం
విద్యార్థిలోకానికి కొండంత ధైర్యం
కాషాయ కాగడాలే తన ఆయుధం
అలుపెరుగని ఆత్మవిశ్వాసం తన నైజం
విద్యారంగం సమస్యలను
పరిష్కరించే పోరాటపు సౌధం
ఆర్టికల్ 370 రద్దుకై
శ్రమించిన దేశభక్తి భావజాలం
నినాదాలతో హోరెత్తించి
విధానాలను మార్చిన సంకల్పం
విద్యా ప్రమాణాలను ప్రగతి దిశగా
నడిపించిన కాంతి కిరణం
లాల్‌చౌక్ పై జాతీయ జెండాను
ఎగరవేసిన వీరత్వం
ప్రపంచ మేటి విద్యార్థి సేనకు నిదర్శనం
లక్షలాది కార్యకర్తలను నిర్మాణం చేసిన క్షేత్రం
ఎందరో అమరుల త్యాగాలను స్మరించే ఆదర్శం
ఉగ్రవాద ఆగడాలను సైతం తరిమికొట్టిన వైనం
ప్రతిభను ప్రోత్సహించే ఔదార్యం
అనునిత్యం విద్యార్థి సంక్షేమానికై పరితపించే
లక్షణం
విశ్వవిద్యాలయాలను కంటికి రెప్పలా కాపాడుకునే
పట్టుదలకు సంకేతం
సేవా కార్యక్రమాల్లో ముందునడిచిన సాహసం
నేషన్ ఫస్ట్ సేల్ఫ్ నెక్స్ట్ అనేది తన నినాదం
జనహితమే అనుక్షణం పరిషత్ అభిమతం
విద్యార్థి శక్తిని జాతీయశక్తిగా
ఎలుగెత్తి చాటిన శిఖరం
విద్యార్థులకు మంచి వ్యక్తిత్వాన్ని
అందించే జాతీయత భావజాలం
ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవమే జాతీయవిద్యార్థి
దినోత్సవం గా ప్రకటించిన గొప్పతనం

**- వంశీకృష్ణ గౌడ్ బండి**
9550837962

# తప్పెక్కడ జరుగుతుంది?



జన్మ పాపమా! ఆడజన్మ శాపమా! పురిటి బిడ్డ నుండి పండు ముసలి దాకా రక్షణ కోసం గావు కేక లేస్తుంటే..ఎందరోతల్లులు కడుపు కోతతో గుండెలు బద్దలవుతుంటే ఎక్కడ వెతకాలి న్యాయం. దగాకోరు రాజ్యం అనాలా! దుండగులతో ప్రజాస్వామ్యం నిండిపోయింది అనాలా! సరి చేసేది ఎవరు! చెయ్యడానికి ప్రయత్నిస్తుందెవరు!

నెలలు నిండిన గర్భిణిని చూసినా కామమే, నెలల బిడ్డను చూసినా కామమే, నేలపై నడుస్తున్న ఆడ పిల్లని చూసినా కామమే, రేపో మాపో పోయే ముసలమ్మను చూసినా కామమే... అసలు 'తప్పెక్కడ జరుగుతుంది' తల్లి దండ్రుల పెంపకంలోనా! పెరిగే వాతావరణమా! స్నేహితుల సహవాసమా! అమ్మ రొమ్ము పాలు తాగే కదా అంతవాళ్లు అవుతారు మరి ఆకలి తీర్చిన రొమ్మును చూస్తే ఎందుకంత కామమెందుకు మగ జాతికి.

చెప్పాలంటే మగ జాతి అంటే మంచివాళ్ళు కూడా వస్తారు. అలాంటి ఆలోచనలు కలిగిన జాతిని మృగ జాతి అనాలి. ఆడపిల్ల పేరులోనే వేరు చేసిందీ సమాజం. ఆడ పిల్ల అంటే పుట్టిల్లు తనది కాదు. అత్తింటి వారు అక్కున చేర్చుకోరు. అన్ని బాధలు, అవమానాలు పడి జీవితాన్ని గెలవాలని ప్రయత్నిస్తుంటే బజారు కుక్కల్లా మీద పడి పీక్కుతింటున్నారేంటిరా..?

మగాడితో సమానంగా విజయకేతనం ఎగురవేస్తున్నారు ఆడవాళ్లు. అంతరిక్షయాణం చేస్తున్నారు. దూరదేశాలు వెళ్ళి విద్యానభ్యసించి శభాష్ అనిపించుకుంటున్నారు. వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిలబడి బేషుగ్గా బ్రతుకుతున్నారు. తమకు తాము గౌరవం తెచ్చుకోవడమే కాకుండా కన్న వారికి కూడా ఆత్మ గౌరవాన్ని ఇచ్చి సంతృప్తినిస్తున్నారు. ఉన్న ఊరికి, కన్న తల్లికి పేరు తీసుకు రావడమే కాకుండా దేశానికి మంచి పేరు తీసుకువచ్చేందుకు మంచిగా కష్టపడుతున్నారు.

అలాంటి బంగారు తల్లుల భవిష్యత్‌కి బాటలు వేయాలి గాని, బీటలు వేసి తగలెట్టేస్తూ, ముక్కలు చేస్తూ ముచ్చటైన జీవితాన్ని చెల్లాచెదురు చేసేస్తున్నారు అసలు తప్పెక్కడ జరుగుతుంది. శిక్షలు లేవనా! న్యాయస్థానాలు తీర్పులు త్వరపెట్టలేవనా! పట్టించుకునే నాయకులు లేరనా! ఎక్కడ ఎక్కడ తెలుసుకునే ప్రయత్నం చెయ్యండి ప్లీజ్.. ప్లీజ్..

ఒడిని చేర్చుకొని పాలిచ్చి, లాలించి పెంచిన నీ తల్లీ ఒక ఆడది. గుండెలకు హత్తుకుని నీ ఇచ్ఛను తీర్చి మరో బిడ్డకు జన్మ నిచ్చే నీ ఆలి ఒక ఆడది. అది మరచిపోయి విషం జిమ్మే పాములా బుస కొడుతూ ఆడదాని ఉసురు పోసుకోవద్దు. ప్రభుత్వాలు మారాలి అని కోరుకోవడం కాదు వాడొచ్చి ఏం చేసాడు. వీడొచ్చి ఏం చేశాడని కాదు. మనిషిగా మన విజ్ఞత ఏమైంది మొదట తెలుసుకోవాలి కదా! ఇప్పటికీ మించిపోయింది ఏమీ లేదు. తప్పు జరిగిన చోట శిక్షలు కఠినంగా అమలు చెయ్యండి. ప్రజల్లో మార్పు వచ్చేలా జీవోలు తీసుకురండి. వ్యక్తిత్వాలు మారాలి. ఆడది వ్యసనం కాదు జీవితాన్ని ప్రసాదించిన దేవత అని తెలిసేలా చెయ్యాలి.

తప్పు జరిగాకా అన్ని టీవీ ఛానల్స్‌లో మూడు రోజులు ఒకే దృశ్యాన్ని చూపించి చూపించి ప్రజలకి పిచ్చెంకించడం కాదు.

తప్పు చూసినోడి ముసుగు తీసి ఏలాంటి శిక్ష విధించారో అదే టీవీ ఛానెల్స్‌లో ఒక్కరోజు చూపించినా తప్పు చెయ్యాలి అనే ఆలోచన వచ్చినోడు కూడా కుక్కిన పేనులా పడుం టాడు. విధి విధానాలు మారాలి. మనం బావున్నాం అది చాలు అనుకుంటూపోతే దేశంలో ఆడజాతి అంతరించిపోతుంది. అప్పుడు భవిష్యత్‌లో మగవారికి సరిపడా ఆడపిల్లలు దొరకరు. అప్పుడు అడవుల్లో జంతువుల మాదిరి దేశంలో పరిస్థితి. అంటే, బలహీన జంతువును బలం కలిగిన జంతువు పీక్కు తిన్నట్టు ఉంటుందన్నమాట. ప్రస్తుతం మన దేశంలో సగం ఈ మాదిరి ఉందని నిర్మొహమాటంగా చెప్పవచ్చు. ఇంకా చెప్పాలంటే ఆడపిల్లల్ని కనడానికి భయపడే పరిస్థితులు లేకపోలేదు.

కాకపోతే, పుట్టిన బిడ్డకు ఒడ్ల గింజవేసి చంపేసే ఆ రోజుల నుండి పుట్టి ఊయలూగే బిడ్డను తీసుకెళ్లి తన కోర్కెలు తీర్చుకునేంతగా మారింది దేశ భవిష్యత్. తప్పు తెలుసుకోవాలి. తెలియజేసే చర్యలు చేపట్టాలి. అవసరమైతే తప్పు చేసినోడి తల నరికి చెయ్యాలి ప్రచారం. ముక్కలు చేసినవాడి చేతులు తీసెయ్యాలి. ' గాంధీ చెప్పినట్టు ఒక చెంప మీద కొడితే మరో చెంప చూపించే అహింసావాదం లేదిప్పుడు'. తల్లడిల్లుతున్న ఆడబిడ్డల తల్లులకు ప్రశాంతత కావాలి. రగిలే గుండెలను శాంతి కావాలి.

**- వాసి జ్యోత్స్న**
9866843005

# కృష్ణమ్మకు జలహారతి

## పసుపు,కుంకుమ, చీరె, సారెలను సమర్పించిన మంత్రి నిమ్మ

## ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద కృష్ణమ్మలో కలిసిన గోదావరి జాలాలు



**ఇబ్రహీంపట్నం, జూలై 09 (మనం న్యూస్):** దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో నదుల అనుసంధానం చేసిన అపర భగీరథుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. బుధవారం నాడు ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని పవిత్ర సంగమం వద్ద పట్టిసీమ నుండి వస్తున్న గోదావరి జలాలు కృష్ణా నదిలో కలుస్తున్న ప్రదేశంలో కృష్ణా, గోదావరి జలాలకు ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, కలెక్టర్ లక్ష్మీశ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్యలతో కలిసి ప్రత్యేక జల హారతులను సమర్పించారు. నదీ జలాలకు హారతితో పాటు పసుపు, కుంకుమ, చీర, సారెలను సమర్పించారు. అనంతరం మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ రు.13 వందల కోట్లతో పట్టిసీమ నిర్మిస్తే, 2014-19 లో పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణాడెల్టాకు తరలించడం ద్వారా రూ. 50వేల కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. 2014-19 లో 5 ఏళ్లలో 263 టీఎంసీ లకు పైగా గోదావరి జలాలను కృష్ణ డెల్టాకు తరలించామన్నారు. ఇది శ్రీశైలం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం కంటే ఎక్కువని అన్నారు. ఇప్పటివరకు పట్టిసీమ ద్వారా 428 కు పైగా టీఎంసీ లను కృష్ణాకు తరలించామన్నారు. ఇది నాగార్జున సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం కంటే ఎక్కువని తెలిపారు. నాడు టీడీపీ హయాంలో 1040 లిఫ్ట్ స్కీమ్స్ ద్వారా సాగు నీరందిస్తుంటే , వైసీపీ హయాంలో సరైన నిర్వహణ లేకపోవడం వల్ల 450 లిఫ్ట్ లు మరుగున పడ్డాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటర్ మేనేజ్మెంట్ ద్వారా అన్ని రిజర్వాయర్లలో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేయగలిగామన్నారు. రాష్ట్ర విభజన వల్ల జరిగిన నష్టం కంటే, జగన్ పాలన వల్లే రాష్ట్రానికి ఎక్కువ నష్టం జరిగిందన్నారు. వెంటి లేటర్ మీద ఉన్న ఆర్థిక వ్యవస్థ కు చంద్రబాబు , పవన్ కళ్యాణ్, మోదీ ల సహకారంతో ఆక్సిజన్ ఇచ్చి ఊపిరి పోస్తున్నారని పేర్కొన్నారు. విజయవాడ ఎం.పి కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూర దృష్టికి నిదర్శనమే ఫెర్రి ఘాట్ పవిత్ర సంగమమనిఅన్నారు. కృష్ణ గోదావరి నదులను అనుసంధానం చేసిన విజనరీ లీడర్ సీఎం చంద్రబాబు అని అన్నారు. జగన్ పట్టిసీమను వట్టి సీమ చేస్తే, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నదులకు జలకళ సంతరించేలా చర్యలు చేపట్టారన్నారు. గోదావరి, కృష్ణా నదులు అనుసంధానం వల్ల కృష్ణా డెల్టా దిగువ బాగాన ప్రజలు, రైతులకు అవసరమైన తాగునీరు కష్టాలు తీరాయన్నారు.

ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ సిహెచ్.చిట్టిబాబు, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు, కౌన్సిలర్ చనుమోలు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



- అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ సెంట్రల్, జూలై 09 (మనం న్యూస్):** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, జ్వరాలు ప్రబలకుండా అత్యంత అప్రమత్తంగా ఉండాలని, డెంగీ, మలేరియా, డయేరియా కేసులు నమోదుకాకుండా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. సీజనల్ వ్యాధులతో పాటు ఉపాధి హామీ పథకం అమలు, ఉద్యాన పంటల పెంపకం అంశాలపై కలెక్టర్ లక్ష్మీశ బుధవారం కలెక్టరేట్ నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, వైద్యాధికారులు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఎక్కడైనా వ్యాధి కేసు నమోదైతే పరిసర ప్రాంతాలలో ఇంటింటి సర్వే నిర్వహించి, నివారణ చర్యలు చేపట్టాలన్నారు. క్రమంతప్పకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఎక్కడా వర్షపునీరు నిలిచిపోకుండా చూడాలన్నారు. యాంటీ లార్వాల్ ఆపరేషన్స్ను విస్తృత స్థాయిలో చేపట్టాలని ఆదేశించారు. జ్వరాల కేసుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు కలెక్టరేట్లోని కమాండ్ కంట్రోల్ రూమ్కు అందిస్తే అక్కడి నుంచి ఆయా ప్రాంతాల క్షేత్రస్థాయి బృందాలను అప్రమత్తం చేయడం జరుగుతుందన్నారు. సమన్వయం విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలను ప్రాణంపెట్టి చేయాలని.. దీనివల్ల ప్రజలకు ఆరోగ్య భద్రత లభిస్తుందని పేర్కొన్నారు. దోమల నియంత్రణతో పాటు సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలు, డిజిటల్ కంటెంట్, వీడియో షార్ట్ క్లిప్పింగ్స్ వంటివాటితో అవగాహన కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రజా భాగస్వామ్యంతో ప్రత్యేకంగా ర్యాలీలు వంటివి నిర్వహించాలని స్పష్టం చేశారు. తాగునీటి వాటర్ సోర్స్లతో పాటు ఫిల్టర్ పాయింట్లను నిరంతరం తనిఖీ చేయాలని, ఎక్కడా కలుషితమయ్యే పరిస్థితి రాకుండా చూడాలన్నారు. ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్లు చేపట్టాలని, ఓవర్హెడ్ రిజర్వాయర్ల క్లీనింగ్, క్లోరినైజేషన్ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎం, ఆశా, సచివాలయ సిబ్బందితో అధికారులు సమన్వయం చేసుకుంటూ సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ఆసరాతో ఉచితంగా పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టేలా ప్రోత్సహించి రైతుకు మంచి ఆదాయం వచ్చేలా చేయాలని, దీనికి సంబంధించి నిర్దేశించిన నాలుగు వేల ఎకరాల లక్ష్యంలో ఒక్క సెంటు కూడా తగ్గడానికి వీల్లేదని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. ఆర్డీవోలు, ఎంపీడీవోలు, ఏపీవోలు తదితరులు రైతులకు అవగాహన కల్పించి, ప్రోత్సహించాలని ఆదేశించారు. ఇప్పటికి దాదాపు 50 శాతం లక్ష్యాలను చేరుకున్నందున మిగిలిన లక్ష్యాన్ని యుద్ధప్రాతిపదికన చేరుకునేందుకు కృషిచేయాలని స్పష్టం చేశారు. సన్న చిన్నకారు రైతులను పేదరికం నుంచి బయటపడేసేందుకు ఇదో గొప్ప మార్గమని.. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా వ్యవసాయ, ఉద్యాన, ఉపాధి హామీ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, డ్వామా పీడీ ఎ.రాము, డీపీవో పి.లావణ్యకుమారి, ఇన్చార్జ్ డీఎంహెచ్వో డా. జె.ఇందుమతి, జిల్లా మలేరియా అధికారి వి.మోతిబాబు, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ జె.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# మోపిదేవి సుబ్బారాయుడి హుండీ లెక్కింపు



**మోపిదేవి,జులై 9 (మనం న్యూస్);** మోపిదేవి శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించగా రూ.1,11,75,901ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో బుధవారం ఆలయ ప్రాంగణంలో హుండీలలోని కానుకల లెక్కింపు జరిగింది.104 రోజులకు రూ.1,11,75,901 నగదుతో పాటు, బంగారం 41 గ్రాముల 020 మిల్లిగ్రాములు, వెండి 2 కేజీల 550 గ్రాములు, యుఎస్ఏ డాలర్లు 159 వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో మోపిదేవి స్టేట్ బ్యాంక్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, ఆలయ సిబ్బంది, సేవా సమితి సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# జై దుర్గ భవాని ...శాకంభరీ నమోస్తుతే..




**విజయవాడ పశ్చిమ, జూలై 09 (మనం న్యూస్):** ఇంద్రకీలాద్రి పై రెండవ రోజు శాకంభరిఉత్సవాలు రెండవ రోజైన బుదవారం నాడు ఘనంగా జరిగాయి. జులై 10 మూడవరోజు గురువారం ఉదయం 9:30 కు మహా పూర్ణాహుతితో ఉత్సవం సమాప్తమవనున్నది. కన్నులు విందుగా ఇంద్రకీలాద్రి పై రెండో రోజు అలంకరణ చేశారు. ఆలయ ఈవో శీనానాయక్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్ర నలుమూలల నుండి ఈ ప్రత్యేక పండగకు భక్తులరాకతో ఆలయం కిటకిటలాడింది. ఇప్పటివరకు ఆలయ అలంకరణ, కదంభం ప్రసాదం తయారీ నిమిత్తం సుమారు 50 టన్నుల పైనే కూరగాయలను వినియోగించినట్లు తెలుస్తోంది. గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల దాతల నుండి కూరగాయయలను సేకరించారు. కూరగాయల సేకరణ నిమిత్తం ఆలయ సిబ్బంది 10 రోజులు నుండి శ్రమిస్తున్నారు. ప్రధాన ఆలయం లో కనకదుర్గ అమ్మవారు, మహా మండపంలో ఉత్సవమూర్తి, ఉపాలయాలల్లో దేవతా మూర్తులంతా హరిత వర్ణంతో విరాజిల్లుతున్నారు. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 వరకు ప్రత్యేక, అంతరాలయ దర్శనం రద్దు అని ఈవో శీనా నాయక్ ప్రకటించారు. భక్తులరద్దీ దృష్ట్యా దేవాలయ సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారు. మూడవరోజు ముగింపు రోజు పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకునే అవకాశం ఉన్నందున సిబ్బంది సెలవులను రద్దు చేశారు.

# తైక్వాండో ఛాంపియన్ షిప్ పోస్టర్ ఆవిష్కరించిన ఎంపీ



**విజయవాడ తూర్పు, జూలై 09 (మనం న్యూస్)** 10వ నేషనల్ ఓపెన్ తైక్వాండో ఛాంపియన్ షిప్-2025 పోస్టర్ ను ఏసీఏ అధ్యక్షుడు, ఎంపి కేశినేని శివనాథ్ గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో బుధవారం ఆవిష్కరించారు. ది కృష్ణ డిస్ట్రిక్ టైక్వాండ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ సహకారంతో 10వ నేషనల్ ఓపెన్ తైక్వాండో ఛాంపియన్ షిప్ కాంపిటీషన్స్ జూలై 25 నుంచి జూలై 27 వరకు పటమట హైస్కూల్ రోడ్డులో గల చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ కు అసోసియేషన్ సెక్రటరీ ఎల్.శివ భాస్కర్ వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి బొప్పన భవకుమార్, కార్యవర్గ సభ్యులు వి. రాము, పి.సంపత్, ఎస్. రంజిత్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# దుర్గమ్మ ను దర్శించుకున్న మాజీ క్రికెటర్ ఎమ్మెస్ కే ప్రసాద్



**విజయవాడ పశ్చిమ, జూలై 09 (మనం న్యూస్):** అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని భారత క్రికెట్ టీం మాజీ చీఫ్ సెలెక్టర్ ఎంఎస్ కె ప్రసాద్ అన్నారు. బుదవారం ఆయన నగరంలోని దుర్గమ్మ ఆలయానికి చేరుకుని శాకంబరీ దేవి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భారత క్రికెట్ టీం లో కీలకమైన వికెట్ కీపర్ గా బాధ్యతలు నిర్వహించి మనదేశానికి ఎన్నోసార్లు విజయాన్ని అందించారు. అమ్మవారి ఆలయానికి చేరుకున్న ఆయన ఈ సందర్భంగా దుర్గ గుడి ఈవో శీనా నాయక్ ని కలిసి ఆలయ అభివృద్ధి, చేపట్టిన సంస్కరణలు పట్ల అభినందనలు తెలిపారు. భారత మాజీ వికెట్ కీపర్ కు అమ్మవారి ప్రసాదాలను ఈవో అందజేశారు.

# రేమల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన కలెక్టర్



**బాపులపాడు, జూలై 09,(మనం న్యూస్)** బుధవారం కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ బాపులపాడు మండలంలోని రేమల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులు తింటున్న ఆహారాన్ని రుచి చూసి, వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఏం చదువుకుంటున్నావు, స్కూల్లో చదువు బాగా చెబుతున్నారా, భవిష్యత్తులో ఏమవుతావు, ప్రతిరోజు భోజనం బాగుంటుందా అని ఆరా తీస్తూ విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం ఆయన పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. ముందుగా జిల్లా కలెక్టర్, మాక్సిమస్ ఏఆర్సీ లిమిటెడ్ వారి సౌజన్యంతో పాఠశాలలో ఏర్పాటు చేసిన నూతన ఆర్వో ప్లాంట్, కంప్యూటర్ ల్యాబ్, భోజనశాలను ప్రారంభించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు సహృదయంతో ముందుకు వచ్చిన మాక్సిమస్ ఏఆర్సీ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధి దేవినేని నన్హ రామ్ ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన ప్రధానోపాధ్యాయుల చాంబర్లో ఉపాధ్యాయులతో సమావేశమై నేడు గురువారం పాఠశాలలో మెగా తల్లిదండ్రులు, టీచర్ మీటింగ్ కార్యక్రమం నిర్వహణ ఏర్పాట్లపై ఆరా తీశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆహ్వాన సందేశాలు పంపడం, ప్రోగ్రెస్ కార్డుల గురించి వాకబు చేస్తూ కార్యక్రమం రోజున ప్రతి విద్యార్థి కొత్త స్కూల్ యూనిఫాం ధరించాలని, సర్వేపల్లి రాధా కృష్ణన్ స్కూల్ కిట్లు ఉండాలని ఆయన ఆదేశించారు. ఉదయం 9 గంటలకు నుంచి కార్యక్రమాలు ప్రారంభం కావాలని, కార్యక్రమంలో విద్యార్థుల ప్రగతిని తెలిపి, తల్లిదండ్రులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించాలని సూచించారు. మండలం లోని రేమల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సమీపంలో బెజవాడ ఏడుకొండలు అనే రైతు 14 ఎకరాల్లో సాగు చేస్తున్న కోకో పంటను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పంట సాగుకు అయ్యే ఖర్చు, వచ్చే దిగుబడి, సమస్యలు తదితర వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. మొక్క నాటిన రోజు నుంచి మూడు సంవత్సరాల తర్వాత పంట చేతికొస్తుందని, సాధారణ చాక్లెట్లతో పాటు యాంటీ డయాబెటిక్ చాక్లెట్ల తయారీ కంపెనీలకు అమ్ముతున్నట్లు రైతు కలెక్టర్ కు వివరించాడు. గుడివాడ డివిజన్ ఆర్డిఓ జి బాలసుబ్రమణ్యం, తహసిల్దార్ మురళి కిషోర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లూథర్ పాల్, ఉద్యాన శాఖ అధికారిని జే జ్యోతి, ఏపీ ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ పార్థసారథి తదితరులు కలెక్టర్ తో పాటు ఉన్నారు.

# లెనిన్ సెంటర్ విజయవాడ ప్రజల అభీష్టం




**విజయవాడ సెంట్రల్, జూలై 09 (మనం న్యూస్):** బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ చేసిన వ్యాఖ్యలపై సిపిఐ (యం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్. బాబురావు తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ విజయవాడలో లెనిన్ సెంటర్ ఎవరో నిర్ణయించిన పేరు కాదని అన్నారు. కాలక్రమంలో ప్రజలు నిర్ణయించుకున్న పేరని, దానిని రద్దు చేసే అధికారం ఎవరికి లేదని అన్నారు. బిజెపి అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజునే వివాదం సృష్టించి ప్రజల మధ్య విద్వేషాలు రాజేయాలని మాధవ్ ప్రయత్నించడాన్ని బాబూరావు తీవ్రంగా ఖండించారు. లెనిన్ విగ్రహాన్ని విజయవాడ పౌర కమిటీ ఏర్పాటు చేసిన తరువాత ఆ కేంద్రాన్ని ప్రజలు లెనిన్ సెంటర్ అని పిలుచుకోవడం ప్రారంభించారని తెలిపారు. తరువాత అధికారికంగా రికార్డులలోకి ఎక్కిందన్నారు. లెనిన్ విదేశీయుడంటూ అరిగిపోయిన రికార్డునే మాధవ్ వేశారన్నారు. లెనిన్ అంతర్జాతీయ శ్రామికవర్గ నేత, శ్రమను గౌరవించేవారెవరైనా ఆయనను గౌరవిస్తారని అన్నారు. ప్రముఖ కవి విశ్వనాథ సత్యనారాయణ పేరుతో విజయవాడ, మాచవరంలో వీధికి నామకరణం చేయబడిందని గుర్తు చేశారు. ఆయన గ్రంథాలు, భావాలపై ఎన్ని భిన్నాభిప్రాయాలు ఉన్నా అందరూ గౌరవిస్తారన్నారు. విజయవాడలో అని బీసెంట్ పేరుతో బీసెంట్ రోడ్ దశాబ్దాల క్రితమే రూపుదిద్దుకున్నదన్నారు. ప్రముఖ ప్రజాస్వామ్య వాది నెల్సన్ మండేలా పేరుతో పార్కు ఏర్పడిందన్నారు. విజయవాడ నగరంలో అనేకమంది ప్రముఖులను పార్టీలకు, ప్రాంతాలకు అతీతంగా గౌరవించుకునే సంప్రదాయం ఉందన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా భిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, మహోన్నత వ్యక్తులను గౌరవించుకోవటం విజయవాడ సంప్రదాయంగా రూపుదిద్దుకున్నదని గుర్తు చేశారు. మాధవ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా వివాదాలను సృష్టించేకన్నా ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి తన హోదాను ప్రభుత్వంలో తన పలుకుబడిని ఉపయోగించడం మంచిదని హితవు పలికారు. ఇప్పటికైనా వివాదాలు కట్టి పెట్టి దశాబ్దాల నుండి ప్రజలు నామకరణం చేసుకున్న లెనిన్ సెంటర్ను గౌరవించాలని బాబూరావు కోరారు.

# తిరువూరు నియోజకవర్గంలో మంత్రి నిమ్మల రామానాయుడు పర్యటన



**తిరువూరు, జూలై 09 (మనం న్యూస్):** ఒకే కుటుంబంలో ఐదుగురు పిల్లలకు తల్లికి వందనం కింద 65 వేల రూపాయలు అందుకున్న పిల్లలతో మంత్రి నిమ్మల రామానాయుడు బుదవారం నాడు ముచ్చటించారు. 1000 రూపాయల పెన్షన్ ను పెంచడానికి జగన్ కి 5 ఏళ్ళు పడితే , చంద్రబాబు మొదటి నెలలోనే పెంచి అందించారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ లోన్ అత్యధికంగా 30 వేల కోట్ల రూపాయలు పింఛన్ల కోసం ఇస్తున్నామన్నారు. జగన్ అధికారంలోకి వస్తే ఒక బిడ్డకు 15 వేలు, ఇద్దరుంటే 30 వేలు ఇస్తామని భారతి రెడ్డి సైతం చెప్పి, అధికారంలోకి వచ్చాక మాట తప్పారన్నారు. గత ప్రభుత్వంలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం తొలి ఏడదే 16 వేలకు పైగా టీచర్ పోస్టులు భర్తీ చేసేలా డీఎస్సీ నిర్వహించామన్నారు. పేదల కడుపు నింపే అన్న క్యాంటీన్లు జగన్ రద్దు చేస్తే, నేడు 210 అన్న క్యాంటీన్లు ద్వారా రోజుకు 2 లక్షల 50 వేల మందికి కడుపు నింపుతున్నామన్నారు. పోలవరం పూర్తి కాదు అంటూ ప్రశ్నార్ధకంగా ఉన్న ప్రాజెక్ట్ పనులు పరుగులు పెట్టిస్తున్నామన్నారు. చంద్రబాబు సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తుంటే , జగన్ తన ఓటమి కి ప్రజలపై పగ తీర్చుకోవడానికి యాత్రల పేరుతో రపా రపా చంపుకుంటూ వెళ్తున్నాడని అన్నారు. చట్ట సభల్లో కి మహిళలు రావాలంటూ పోరాటాలు చేస్తుంటే, వైసీపీ మహిళల వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ వారు రాజకీయాల్లోకి రావాలంటేనే భయం కల్పిస్తున్నారని అన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకంకు చంద్రబాబు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. గత ప్రభుత్వం చేసిన పాపం చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్ట్ కి శాపంగా మారిందన్నారు. గత ప్రభుత్వం సృష్టించిన ఎన్జీటీ, ఈసి అడ్డంకులను అధిగమించి చింతల పూడి ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు.

# దుర్గా ఘాట్లో సమాచార కేంద్రం ఏర్పాటు



- భక్తుల కోసం విస్తృత సదుపాయాలు ఏర్పాటు చేస్తున్న ఇఒ శీనా నాయక్

**విజయవాడ పశ్చిమ, జూలై 09 (మనం న్యూస్):** దుర్గమ్మ భక్తుల కోసం ప్రత్యేకంగా దుర్గా ఘాట్లో (స్థానాల రేవులో) ప్రత్యేక సమాచార కేంద్రాన్ని దుర్గగుడి ఈవో శీనా నాయక్ ఏర్పాటు చేశారు. శాకాంబరి ఉత్సవాలు, అమ్మవారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్న నేపథ్యంలో ఇప్పుడు వరకు దుర్గా ఘాట్ లో భక్తులకు సదుపాయాలు ఎలా అందుతున్నాయి, ఏ విధంగా ఏర్పాటులో ఉన్నాయనే విషయంపై గతంలో ఎవరు ఆరా తీయని విధంగా ప్రస్తుత ఈవో ఎప్పటికప్పుడు భక్తులకే తొలి ప్రాధాన్యతీస్తూ వస్తున్నారు. ఈవో వి.కె.శీనా నాయక్ పవిత్ర కృష్ణా నదిలో స్నానాలు ఆచరించే భక్తుల కోసం ఇప్పటికే పలు ఏర్పాట్లు చేపట్టిన ఈవో తాజాగా ప్రత్యేకంగా స్నానాలు రేవులో ఒక సమాచార కేంద్రం చేయించారు.

# విజయవాడలో సమ్మె సంపూర్ణం

- కదం తొక్కిన కార్మిక వర్గం



**విజయవాడ సెంట్రల్, జూలై 09 (మనం న్యూస్):** రాష్ట్ర రాజకీయ రాజధాని విజయవాడలో కార్మికుల సమ్మె విజయవంతమైంది. తమ విధులను బహిష్కరించి సమ్మెలో వేలాదిగా కార్మిక వర్గం పాల్గొన్నారు. రైల్వే, బ్యాంకు, ఎల్ఐసి, వివిధ సంఘటిత, అసంఘటితరంగాల కార్మికులు వేలాదిగా సమ్మెలో పాల్గొన్నారు. విజయవాడ వన్ టౌన్ రథం సెంటర్ నుంచి లోబ్రిడ్జి మీదుగా, ఏలూరు రోడ్డు లెనిన్ సెంటర్ కు ప్రదర్శనగా చేరుకున్నారు. ప్రదర్శనలో నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, కనీస వేతనం 26,వేలు ఇవ్వాలని, 10.గంటల పని విధానాన్ని రద్దు చేయాలని, నూతన వ్యవసాయం మార్కెట్ విధానాన్ని రద్దు చేయాలని నినాదాలు చేశారు. కార్మిక, కర్షక ఐక్యత వర్ధిల్లాలంటూ పెద్దపెట్టున నినదించారు. సంఘటిత, అసంఘటిత కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం లెనిన్ సెంటర్లో జరిగిన భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు ఎ.ఐ.టి.యు.సి నగర కార్యదర్శి మూలి సాంబశివరావు, సి.ఐ.టి.యు ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు కె.దుర్గారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాల రాష్ట్ర నాయకత్వం మాట్లాడారు. ఈ సమ్మె కేవలం కొసమెరుపు మాత్రమేనన్నారు. రానున్న రోజుల్లో బిజెపి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున యుద్ధం చేయాల్సి ఉందన్నారు. లేబర్ కోడ్లు రద్దు అయ్యే వరకు, కార్మిక చట్టాలు అమలయ్యే వరకు పోరాటం ఆగేది లేదన్నారు. బడా కార్పొరేట్ కంపెనీల కోసం వారికి అనుకూల చట్టాలను రూపొందిస్తున్నారని, కంపెనీల దోపిడీకి ద్వారాలు బార్లా తెరిచారని విమర్శించారు. ఎన్టీఆర్ జిల్లా సిఐటియు అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, సిఐటి జిల్లా ఉపాధ్యక్షులు దోనెపూడి కాశీనాథ్ తదితరులు ప్రసంగించారు. ఈ ప్రదర్శనకు మద్దతుగా సి.పి.ఎం పార్టీ ఆధ్వర్యంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు నాయకత్వన మద్దతు పలికారు. ప్రదర్శన బహిరంగసభలో వేలాది మంది భారీ ప్రదర్శనకు అన్ని రంగాల కార్మిక సంఘాల అనుబంధ యూనియన్లు, రైతు, కూలీ, కౌలు రైతు, ముఠా, ఆటో, బిల్డింగ్, హాకర్స్ ,షాపు,హోటల్, ఆశ, అంగన్వాడీ, బ్యాంక్, ఇన్సూరెన్స్, రైల్వే, స్కీమ్ వరక్స్ పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వన్ టౌన్, మార్కెట్ సెంటర్, రైల్వే లో బిడ్జ్, బస్టాండ్, ఏలూరు రోడ్, లెనిన్ సెంటర్లో ట్రాఫిక్ అంతరాయం జరిగింది. పోలీసులు వాహనాల్ని ట్రాఫిక్ ని పక్కకు మళ్ళించారు. ఈ సమ్మె కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలగాలని కార్మిక సంఘాలు విజ్ఞప్తి చేశాయి.

# ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలను విజయవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, జూలై 09 (మనం ప్రతినిధి) :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో నిర్వహించే ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాల్లో శివ శక్తి సంఘాల మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కోటి మంది కో మహిళలను కోటీశ్వరులుగా చేయాలని ఆశయాలతో ప్రభుత్వం స శక్తి సంఘాల మహిళల అభ్యున్నతి కోసం వివిధ రకాల సంక్షేమ కార్యక్రమాల్ని ప్రవేశపెట్టిందని అన్నారు. జిల్లాలోని 9 మండలాల్లో స్వశక్తి మహిళ సంఘాల చే తొమ్మిది బస్సులను కొనుగోలు చేసే ఆర్టీసీ కు అద్దె పెట్టడం జరిగిందని, ఇటీవలే మొదటి నెల ప్రతి మండలానికి 70 వేల రూపాయల అద్దె జమ కావడం జరిగిందని అన్నారు. మంథని కాల్వ శ్రీరాంపూర్ మండలాల్లో 2 మెగా వాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెద్దపల్లి పట్టణంలో పెట్రోల్ బంక్ ప్రారంభించేందుకు సన్నహాలు చేస్తున్నామని అన్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇందిరా మహిళ శక్తి కార్యక్రమాల్లో భాగంగా జూలై 10, 11 తేదీలలో రండమ్మ సంఘంలో చేరుదాం అనే నినాదంతో సంఘంలో లేని వారికి ఆహ్వానించాలని అన్నారు.

జులై 12,13 తేదీలలో తల్లి బిడ్డల ఆరోగ్యం మనందరి బాధ్యత నినాదంతో గ్రామాలలోని గర్భిణీలను, బాలింతలను, దీర్ఘకాలికంగా అనారోగ్యం గురైన మహిళలను గుర్తించి ఎ.ఎన్.సి రిజిస్ట్రేషన్ చేయాలని, మహిళలకు అవసరమైన రక్త పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు . జూలై 14,15 తేదీలలో అమ్మకు అక్షర వందనం కార్యక్రమం కింద గ్రామాల్లో చదువురాని మహిళలను గుర్తించి వారికి అక్షరాభ్యాసం చేపించి ఉల్లాస్ యాప్ లో నమోదు చేయాలని, తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా 10వ తరగతి, ఇంటర్ లో అడ్మిషన్ ఇప్పించాలని, 18 సంవత్సరాలలోపు దివ్యాంగ పిల్లల్ని గుర్తించే భవిత కేంద్రాలలో చేర్పించాలని, బడి బయట ఉన్న పిల్లల్ని గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అన్నారు.

జూలై 16 17 తేదీలలో జీవనోపాదులు-ఆర్థిక కూర్పు కార్యక్రమం క్రింద మహిళలందరికీ రాష్ట ప్రభుత్వం కల్పిస్తున్న లోన్ బీమా ప్రమాద బీమా అవగాహన కల్పించి, ప్రతి మహిళ పిఎంజేజేబివై, పీఎంజేబివై లో చేరేలా చూడాలని అన్నారు. గ్రామాలలో ఎవరు మైక్రో ఫైనాన్స్ నుంచి రుణాలు తీసుకోకుండా అవగాహన కల్పించాలని, ప్రస్తుత జీవనోపాధిని పెంపొందించుకొని సుస్థిర ఆదాయం పొందేల ప్రోత్సహించాలని, కుటుంబ ఆదాయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు కొత్త వ్యాపారాల పట్ల అవగాహన కల్పించాలని అన్నారు.

జూలై 18న వనలక్ష్మి వ్రతం - ఆటో పాటల పోటీలు కార్యక్రమం కింద మహిళా శక్తి కార్యక్రమం చివరి రోజున వరలక్ష్మి వ్రతం లాగా వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొని పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, స్వశక్తి మహిళా సంఘం సభ్యులందరూ తమ కుటుంబ సభ్యులందరి పేర్లతో ఇంటి ఆవరణలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అన్నారు.

ఇందిరా మహిళా శక్తి కింద జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయాలని, పెద్ద ఎత్తున ప్రసక్తి మహిళా సంఘాల సభ్యులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు

- గంజాయి, మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు
- కోహెడ ఎస్.ఐ.పుల్ల అభిలాష్



**కోహెడ,జూలై 9,(మనం న్యూస్) :** నార్కోటిక్ లో ప్రత్యేక శిక్షణ పొందిన డాగ్ స్క్వాడ్ తో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, స్థానిక ఎస్సై పుల్ల అభిలాష్ ఆధ్వర్యంలో బుధవారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అన్ని షాపులు, హోటల్ బస్ స్టాండ్ ఏరియా మండల కేంద్రంలోని పరిసరాల్లో తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఎస్.ఐ. పుల్ల అభిలాష్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు గుర్తించడానికి ప్రత్యేకంగా శిక్షణ పొందిన డాగ్స్ ను తెప్పించామని, మాదకద్రవ్యాలను అరికట్టడానికి తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు.మాదకద్రవ్యాలు వాడినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఈ డాగ్స్ కు మత్తు పదార్థాల వాసన పసిగట్టి వాటిని సులభంగా గుర్తించే గుణం ఉంటుంది, ఈ కారణంగానే జాగిలాలను తనిఖీల్లో ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల సరఫరా చేసే వారితో పాటు, వినియోగించి వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు ఎవరైనా కలిగి ఉంటే అమ్మిన విక్రయించిన వెంటనే డయల్ 100 లేదా తెలంగాణ యాంటీ నార్కటిక్స్ బ్యూరో టోల్ ఫ్రీ నెంబర్,1908 లేదా హుస్నాబాద్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఏఎస్ఐ బాలగంగాధర్ తిలక్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దుష్ప్రభావాలపై భరోసా వారి అవగాహన సదస్సు


**జగిత్యాల జూలై 9( మనం ప్రతినిధి) :** జిల్లా కేంద్రంలో ఉన్న ఓల్ హైస్కూల్లో పిల్లలకు, టీచర్లకు పోక్సో యాక్ట్ , చైల్ మ్యారేజ్ సోషల్ మీడియా వల్ల జరిగే దుష్ప్రభావాలపై జిల్లా భరోసా సెంటర్ వారు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భరోసా సెంటర్ సపోర్టు పర్సన్స్ సుజాత ప్రతిభ మాట్లాడుతు ప్రస్తుత రోజులలో ఆడపిల్లలపై అఘాయిత్యాలు ఎక్కువగా జరుగుతున్నాయి, ఆడపిల్లలను ఎవరైనా ఇబ్బంది పెడితే వారికి ఫోక్స్ ఆక్ట్ ప్రకారం శిక్షలు విధించడం జరుగుతుంది .ఈ శిక్షలు చాలా కఠినంగా ఉంటాయి కాబట్టి ఎవరు కూడా ఆడపిల్లలను అనవసరంగా ఇబ్బంది పెట్టి శిక్షార్హులు కావద్దు అని ,ఫోక్స్ యాక్ట్ పై అవగాహన కల్పించారు. అదేవిధంగా స్కూలు పిల్లలపై సోషల్ మీడియా చాలా ప్రభావం చూపుతుంది. పిల్లలు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని, సోషల్ మీడియాలో వచ్చే ఎలాంటి ప్రకటనలకు స్పందించ వద్దు అని తెలిపారు. అదే విధంగా చైల్ మ్యారేజ్ వలన జరిగే అనర్థాల గురించి స్కూల్ పిల్లలకు వివరించారు. స్కూల్లోని ఆడపిల్లలకు బ్యాడ్ టచ్ గుడ్ టచ్ గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ సూర్య ప్రకాష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వైద్యానికి అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి

**నిజామాబాద్, జూలై 09 ( మనం బ్యూరో) :** పల్లెల్లో ప్రజలందరికీ వైద్యాన్ని చేరువ చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లె దవాఖానాలను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలో బుధవారం రూ. 1.20 కోట్లతో నిర్మించిన మూడు పంచాయతీ భవనాలు, మూడు పల్లె దవాఖానాలను ఆయన ప్రారంభించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జిల్లాకు ఒక మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పల్లెల్లో నాణ్యమైన వైద్యం అందాలనే ఆలోచనతో మాజీ సీఎం కేసీఆర్ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బాల్కొండ నియోజకరవర్గ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం మెండోరా మండలం



సోన్‌పేట్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి ఎమ్మెల్యే ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఉప సర్పంచ్ చిన్నోళ్ల రమేష్, మాజీ ఎంపీటీసీ మాడుగుల నాగలక్ష్మి, తోపారం హన్మాండ్లు, రాకేష్, ముత్యం, సాగర్, మల్లేష్, ప్రశాంత్, పులి గంగాధర్, రాజన్న, శ్రావణ్, మదన్ తదితరులు ఉన్నారు.

## జాతీయం- అంతర్జాతీయం

# ఈ నెలాఖర్లో ప్రధాని మోడీ యూకే పర్యటన!

- దౌత్యవర్గాల వెల్లడి



**ఢిల్లీ, జూలై 9 :** ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల చివర్లో యూకేలో పర్యటించే అవకాశాలు ఉన్నాయి. ఇరు దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై అధికారికంగా సంతకం చేయడం, రక్షణ, భద్రతా రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను విస్తరించుకునే చర్యల్లో భాగంగా ప్రధాని మోడీ యూకేలో పర్యటించనున్నట్లు దౌత్యవర్గాలు వెల్లడించాయి. ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన కోసం తేదీలను ఖరారు చేసే ప్రక్రియలో ఇరు వర్గాలు ఉన్నాయని దౌత్య వర్గాలు తెలిపాయి. జులై చివరి వారంలో లేదా ఆగస్టు తొలి వారంలో మోడీ పర్యటన ఉండే అవకాశం ఉన్నట్లు వెల్లడించాయి. తొలుత యూకే ప్రధాని కీర్ స్టార్మర్ భారత్‌లో పర్యటిస్తారని సంకేతాలు వెలువడ్డాయి. అయితే.. ఈ ఏడాది చివర్లో ఆయన పర్యటన ఉండే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. గత మే నెలలో భారత్-యూకేల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. మూడేళ్ల చర్చల ఫలితంగా ఇటీవల భారత్, యునైటెడ్ కింగ్‌డమ్‌ల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్టీఏ) కుదిరింది. తద్వారా యూకేలో భారతీయ వస్తుసేవలకు మార్కెట్ పెరగనుంది. అలాగే ఇండియాలో బ్రిటిష్ కంపెనీల ఉత్పత్తులు, సేవల లభ్యత అధికం కానుంది. ఎఫ్టీఏ వల్ల రెండు దేశాల్లో ఉద్యోగాలు, అభివృద్ధి రేటు, ఎగుమతులు పెరుగుతాయి. ఈ ఒప్పందం మూలంగా యూకేకు భారత్ ఎగుమతి చేసే వివిధ రకాల సరకుల్లో 99శాతం వాటిపై సుంకాలు రద్దవుతాయి. అలాగే ఇండియాకి యూకే ఎగుమతి చేసే 90 శాతం ఉత్పత్తులపై సుంకాలను తగ్గిస్తారు. ఐరోపా సమాఖ్య (ఈయూ) నుంచి 2020లో విడివడిన (బ్రెగ్జిట్) దగ్గర నుంచి ఇతర దేశాలతో ఎఫ్టీఏలు కుదుర్చుకోవడానికి యూకే ప్రాధాన్యమివ్వసాగింది. ఇటీవలే అమెరికాతో నేరుగా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంది. బ్రెగ్జిట్ వల్ల మొదట్లో బ్రిటన్‌కు భారత ఎగుమతులు తగ్గినా తరవాత నెమ్మదిగా పుంజుకున్నాయి. అటువైపు నుంచి దిగుమతులూ పెరిగాయి. తాజా ఎఫ్టీఏ వల్ల ద్వైపాక్షిక వాణిజ్యం విస్తరిస్తుంది.

## కొందరికి రాజకీయాల్లో ఓనమాలు తెలియవు

### విజయ్‌కు కనిమొళి చురక

**చెన్నై, జూలై 9:** తమిళనాడులో వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' పార్టీ సిద్ధమవుతోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో డీఎంకే ఎంపీ కనిమొళి ఆయనపై పరోక్షంగా విమర్శలు చేశారు. ఎలాంటి అనుభవం లేకుండానే కొందరు రాజకీయాల్లోకి వస్తున్నారని కనిమొళి పేర్కొన్నారు. ఎట్టాయపురంలో డీఎంకే పార్టీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 'రాజకీయాల్లో ఎలాంటి అనుభవం లేని కొందరు పేదలు ఉన్నారు. వారు అకస్మాత్తుగా ఎక్కడినుంచో వస్తారు. కేంద్రానికి, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య తేడాలు తెలుసుకోకుండానే ప్రశ్నలు వేస్తారు. మీరు నిజంగానే తమిళనాడు ప్రజల తరఫున పోరాడాలనుకుంటే ముందు వారి అవసరాల గురించి, రాజకీయాల గురించి పూర్తిగా తెలుసుకోవాలి' అని కనిమొళి పేర్కొన్నారు. పాలనా నిర్మాణాలను అర్థం చేసుకోకుండా ఎన్నికల వాగ్దానాలు చేసేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు రాజకీయాల్లో దీర్ఘకాల అనుభవం ఉందని, ప్రజలకు అలాంటి సీఎం అవసరమన్నారు. ఈ విషయాన్ని పార్టీ నేతలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అధికార డీఎంకే, విజయ్ పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఇటీవల రాష్ట్రంలో వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే నుంచి విజయ్ సీఎం అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో తమ సైద్ధాంతిక శత్రువులైన డీఎంకే, బీజేపీలతో ఎప్పటికీ పొత్తు ఉండదని ఆయన స్పష్టంచేశారు. బీజేపీ విభజన రాజకీయాలు తమిళనాడులో చెల్లవన్నారు.

# యెమెన్‌లో భారతీయ నర్సు మరణశిక్ష ఆగేనా?

- ఇంకా ఆరు రోజులే... రక్షించడానికి
- తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న ప్రభుత్వం

**సనా, జూలై 9 :** యెమెన్‌లో వ్యాపార భాగస్వామిని హత్య చేసిన కేసులో కేరళ నర్సు నిమిష ప్రియకు మరణశిక్ష పడిన విషయం తెలిసిందే. ఈ నెల 16న ఆమెకు శిక్ష అమలు చేయనున్నట్లు సమాచారం. మరి ఆమెకు మరణశిక్ష ఆగేనా? ఆమెను కాపాడే అవకాశాలున్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



యెమెన్‌లో రెండు సమాంతర ప్రభుత్వాలు నడుస్తున్నాయి. ఒకటి ప్రపంచం గుర్తించిన ప్రెసిడెన్షియల్ కౌన్సిల్ కాగా.. మరొకటి హూతీ రెబెల్స్ నేతృత్వంలోని సుప్రీమ్ పొలిటికల్ కౌన్సిల్. ప్రెసిడెన్షియల్ కౌన్సిల్‌తో భారత ప్రభుత్వానికి దౌత్యపరమైన సంబంధాలు ఉన్నాయి. హత్య కేసులో నిమిషను ట్రయల్ కోర్టు దోషిగా తేల్చి, మరణశిక్ష విధించింది. హూతీల పాలనలో ఉన్న సుప్రీం జ్యుడిషియల్ కౌన్సిల్ 2023లో దానికి ఆమోదముద్ర వేసింది. ప్రపంచం గుర్తించిన ప్రభుత్వాధ్యక్షుడు రషద్ అల్ అలిమి ఈ మరణ శిక్షకు ఆమోదం తెలిపారని కొన్ని కథనాలు వెల్లడయ్యాయి. కానీ ఢిల్లీలోని యెమెన్ దౌత్యకార్యాలయం మాత్రం ఈ కేసు హూతీల ఆధీనంలో ఉందని తెలిపింది. ఆమెను కాపాడేందుకు భారత్ ప్రయత్నిస్తున్నప్పటికీ హూతీలతో అధికారిక దౌత్య సంబంధాలు లేని కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. యెమెన్‌లోని చాలా ప్రాంతాలు ఈ గ్రూప్ నియంత్రణలో ఉన్నాయి. 'నిమిషకు మరణశిక్ష పడినదగ్గరి నుంచి ఈ కేసును నిశితంగా పరిశీలిస్తున్నాం. యెమెన్ అధికారులు, ఆమె కుటుంబ సభ్యులతో నిత్యం సంప్రదింపులు జరుపుతున్నాం. సాధ్యమైన అన్ని రకాల సహకారాన్ని అందిస్తున్నాం' అని భారత అధికారి ఒకరు మీడియాకు వెల్లడించారు.

గత ఏడాది నిమిష తల్లి ప్రేమకుమారి యెమెన్ వెళ్లారు. బ్లడ్‌మనీ ఇచ్చి, తన కుమార్తెను కాపాడుకునేందుకు ఆమె చేసిన ప్రయత్నాలు మధ్యలోనే ఆగిపోయాయి. మృతుడు తలాల్ అదిబ్ మెహది కుటుంబానికి కొంత మొత్తం పరిహారం చెల్లిస్తే నిందితులను క్షమించి వదిలేసే అవకాశం యెమెన్‌లో ఉంది. దీంతో ప్రియా కుటుంబం దాదాపు 40 వేల డాలర్లను (రూ.34,20,000) మెహది కుటుంబానికి ఇచ్చేందుకు సమీకరించింది. బాధితుడి కుటుంబంతో చర్చలు జరిపేందుకే భారత దౌత్య కార్యాలయం ఏర్పాటుచేసిన న్యాయవాది అబ్దుల్ అమిర్ 20వేల డాలర్లు డిమాండ్ చేశాడని నిమిష ప్రియా తల్లి ప్రేమకుమారి ఆరోపించారు. కొన్ని నివేదికల ప్రకారం నిమిష కుటుంబం రూ.8.5 కోట్లు చెల్లించడానికి ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది. అయితే హత్యకు గురైన వ్యక్తి కుటుంబం ఎంత మొత్తం ఆశిస్తుందో అన్న అంశంపై స్పష్టత లేదు.

# వనమహోత్సవాన్ని నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తీసుకోవాలి




- జిల్లా కలెక్టర్‌ను ఆదేశించిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

**నిజామాబాద్, జూలై 09 ( మనం బ్యూరో) :** వనమహోత్సవాన్ని నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డిని ఆదేశించారు. రెండో విడత వనమహోత్సవంలో భాగంగా బోధన్ మండలం బెల్లాల్ గ్రామంలో కలెక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ., ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 51 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మొక్కలు నాటడమే కాదు వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులేనన్నారు. ఏ అధికారైనా నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేజీ టు పీహెచ్‌డి.. 'స్విమ్మింగ్'లో ఉచిత శిక్షణ!

**తిరువనంతపురం, జూలై 9 :** ఓ పడవ ప్రమాదం ఆయన్ను తీవ్రంగా కలచివేసింది. ఆ దుర్ఘటనలో 45 మంది మృతి చెందడం చూసి చలించిపోయారు. ఈ క్రమంలోనే భవిష్యత్తులో నీటి ప్రమాదాల సమయంలో ప్రాణనష్టాన్ని నివారించాలనే లక్ష్యంతో 'ఈత' తరగతులకు శ్రీకారం చుట్టారు. దాదాపు 16 ఏళ్లలో ఏకంగా 15 వేలమందికిపైగా శిక్షణ అందించారు. అదీ ఉచితంగానే. ఆయనే కేరళకు చెందిన సాజీ వళస్సెరిల్ (61). చదువుల్లో ఎల్‌కేజీ, యూకేజీ నుంచి పీహెచ్‌డీ వరకు మాదిరిగానే స్విమ్మింగ్ ట్రైనింగ్‌లోనూ ఇదే తరహా విధానాన్ని అమలు చేయడం ఆయన ప్రత్యేకత. కేరళలోని ఆళువాలో ఓ ఫర్నీచర్ దుకాణం నిర్వహించే సాజీ.. ఆరేళ్ల వయసులో తన తండ్రి నుంచి ఈత నేర్చుకున్నారు. 2007లో తన ఇద్దరు పిల్లలతోపాటు మరో ఇద్దరికి స్విమ్మింగ్ నేర్పించారు. పెరియార్ నదిని వారు విజయవంతంగా ఈదడంతో.. ఆయన శిక్షణ గురించి అందరికీ తెలిసింది. దీంతో ఈత క్లాసుల కోసం ఆయన వద్దకు స్థానికుల రాక పెరిగింది. ఈ క్రమంలోనే 2009లో తెక్కడి కొలనులో ఓ బోటు మునిగిపోయి 45 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో చలించిపోయిన ఆయన.. పూర్తిస్థాయిలో శిక్షణ ప్రారంభించారు.



**ఉదయం 4.30కు తరగతులు షురూ..**

పెరియార్ నదిలోని 'మణప్పురం దేశం కడవు'లో ఉదయాన్నే 4.30 గంటలకు స్విమ్మింగ్ తరగతులు మొదలవుతాయి. రోజూ రెండు బ్యాచ్‌లలో వెయ్యి మంది శిక్షణ పొందుతుంటారు. దీని కోసం ఆయన పకడ్బందీ విధానాన్ని రూపొందించారు. ట్రైనింగ్ పూర్తి చేసుకున్న వారు గ్రూప్ లీడర్లుగా వ్యవహరిస్తూ.. కొత్తవారిని పర్యవేక్షిస్తుంటారు. శ్రేయోభిలాషులు, దాతల సాయంతో టాయిలెట్లు, దుస్తులు మార్చుకునే గదుల వంటివి ఏర్పాటు చేశారు. అంబులెన్సు, బోటును కూడా అందుబాటులో ఉంచారు. తరగతులు ఉచితమైనప్పటికీ.. నెలకు రూ.100 చొప్పున స్వచ్ఛందంగా చెల్లించొచ్చు. ఈత శిక్షణలో ప్రతి దశకు చదువుల్లో మాదిరిగానే కేజీ నుంచి పీహెచ్‌డీ వరకు పేర్లు పెట్టారు. 'కేజీ'లో భాగంగా నీళ్లలో ఒక నిమిషం పాటు ఊపిరి బిగపట్టడం నుంచి శిక్షణ మొదలవుతుంది. ఎల్‌కేజీ, యూకేజీ నుంచి డిగ్రీ, పీజీ పూర్తయ్యేసరికి నీళ్లలో చాలాసేపు శ్వాస బిగపట్టడం, చాలాదూరం ఈత కొట్టడం, రెస్క్యూ ట్యూబ్‌ల వినియోగం, నది అడుగుభాగం నుంచి ఇసుకను తీసుకురావడం వంటివి నేర్చుకుంటారు. పీహెచ్‌డీ పూర్తి చేయాలంటే గంటపాటు ఆగకుండా ఈత కొట్టాల్సిందే. తుది పరీక్షలో భాగంగా మండపం కడవులో 750 మీటర్ల వెడ్పున నదిని సగం వరకు ఈది.. వెనక్కి రావాల్సి ఉంటుంది. జీవితంలో అతి ముఖ్యమైన నైపుణ్యాల్లో 'ఈత' ఒకటి. అయినప్పటికీ చాలామంది విస్మరిస్తుంటారన్న విషయాన్ని గుర్తెరిగిన సాజీ.. విద్యార్థుల్లో ఈ మేరకు స్ఫూర్తి నింపుతుంటారు. నిబద్ధతతో కూడిన ఆయన శిక్షణతో అనేక మంది జీవితాల్లో సానుకూల మార్పులు వచ్చినట్లు చెబుతుంటారు. తమ పిల్లల్లో ఫోన్ వాడకం కూడా తగ్గిందని తల్లిదండ్రులు తన దృష్టికి తీసుకొచ్చినట్లు సాజీ తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలూ శిక్షణ పొందుతున్నారని, వారిలో ఒకరు ఇటీవల పెరియార్ నదిని విజయవంతంగా ఈదారని గర్వంగా చెప్పారు.

# టిబెట్ విషయంలో జోక్యం చేసుకోవద్దు

- అమెరికాకు చైనా వార్నింగ్

**బీజింగ్, జూలై 9 :** దలైలామా వారసుడి విషయంపై ఇటీవల తీవ్రస్థాయిలో చర్చలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో టిబెట్ విషయంలో అమెరికా జోక్యం చేసుకోవడాన్ని చైనా తప్పుబట్టింది. ప్రస్తుత దలైలామా 90వ పుట్టినరోజు సందర్భంగా అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రూబియో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో బీజింగ్ ఈ హెచ్చరికలు చేసినట్లు తెలుస్తోంది.

దలైలామాకు రూబియో శుభాకాంక్షలు తెలిపారు. టిబెట్‌కు నాయకుడిగా ప్రపంచంలో ఐక్యత, శాంతి, కరుణను ప్రచారం చేస్తున్నందుకు ప్రశంసించారు. ఈ సందర్భంగా టిబెట్ ప్రజలకు తమ ఆధ్యాత్మిక నాయకుడిని ఎన్నుకునే స్వేచ్ఛ, మతపరమైన గుర్తింపు కాపాడుకునే హక్కు వారికి ఉంటుందన్నారు. ఈ వ్యాఖ్యలను సహించలేనివని చైనా మండిపడింది. చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి మావో నింగ్ మాట్లాడుతూ.. 'దలైలామా మతం ముసుగులో చైనా వ్యతిరేక వేర్పాటువాద కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు. ఆయనకు టిబెట్ ప్రజలకు ప్రాతినిధ్యం వహించే, ఈ ప్రాంత భవిష్యత్తును నిర్ణయించే హక్కు లేదు. ఈ విషయంలో అమెరికా జోక్యం చేసుకోవడం తగదు. ఇది ఒక సున్నితమైన అంశమని అమెరికా గుర్తుంచుకోవాలి' అని పేర్కొన్నారు. ఈసందర్భంగా అమెరికా వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తోందని ఆరోపించారు.

భవిష్యత్తులో తన వారసత్వం కొనసాగుతుందని ఇటీవల దలైలామా పేర్కొన్న సంగతి తెలిసిందే. ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని, గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్టు మాత్రమే వారసుడిని గుర్తిస్తుందని, మరెవరికీ ఈ విషయంలో జోక్యం చేసుకునే అధికారం లేదని పరోక్షంగా చైనాకు తేల్చి చెప్పారు.



టిబెట్‌పై పట్టు కోసం భవిష్యత్తులో దలైలామా స్థానాన్ని తీసుకోవాలని చైనా భావిస్తోంది. ఈ క్రమంలో దలైలామా ప్రకటనపై బీజింగ్ అభ్యంతరం తెలిపింది. వారసుడి ఎంపికకు తమ ఆమోదముద్ర ఉండాల్సిందేనని డిమాండ్ చేసింది. దలైలామా వారసుడి ఎంపిక నిర్ణయం ఆయన చేతుల్లోనే ఉందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో దలైలామా అంశంలో జోక్యం చేసుకోవడం తగదంటూ భారత్‌పై చైనా వ్యాఖ్యలు చేసింది. ఈ క్రమంలోనే మత విశ్వాసాలు, ఆచారాల్లో ఎప్పుడూ జోక్యం చేసుకోదని భారత్ స్పష్టం చేసింది.



## అనాథ పిల్లల ఆధార్ గుర్తింపునకు సర్వే

**కర్నూలు, జూలై 9(మనం న్యూస్):** అనాథ పిల్లల ఆధార్ గుర్తింపు కొరకు సర్వే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఆదేశాల మేరకు ఆధార్ లేని అనాథలకు ఆధార్ కార్డును ఇప్పించి వారికి ప్రభుత్వ పథకాలు లబ్ధి పొందేలా చేయడానికి స్పెషల్ ఆధార్ డ్రైవ్‌లో భాగంగా నేడు బంగారు పేట మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో అవగాహన కార్యక్రమాన్ని, బంగారు పేటలో సర్వేను నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సాధి కమిటీ సభ్యులు, లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల లబ్ధి పొందేందుకు ఆధార్ కార్డులు తప్పనిసరి అని విద్యా ,వైద్యం, పునరావాసం, షెల్టర్ హోమ్ లలో ప్రవేశం కొరకు తల్లిదండ్రులేని అనాధలను ఈ స్పెషల్ ఆధార్ డ్రైవ్‌లో గుర్తించి వారికి ఆధార్ కార్డును ఇవ్వడానికి ఈ స్పెషల్ ఆధార్ డ్రైవ్ ఫర్ డిస్టిట్యూట్ చిల్డ్రన్ సర్వే కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్ వర్కర్ గీతావాణి ,బాలల సంరక్షణ సాధికారిక అధికారి దీపా, రంగమ్మ ,పాఠశాల ఉపాధ్యాయులు రఘు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టండి

- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగ నాయుడు

**మహానంది, జూలై 9(మనం న్యూస్):** ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అమలు చేయడంలో వైఫల్యం చెంది మాట మారుస్తూ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ పేద ప్రజలపై పన్నుల భారం మోపుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగ నాయుడు పిలుపునిచ్చారు. సీపీఐ 11వ మండల మహాసభను మహానంది మండలంలోని బుక్కాపురం గ్రామంలో భారీగా ప్రదర్శన నిర్వహించి సీపీఐ మండల కార్యదర్శి ఆర్.సామ్యేల్ అధ్యక్షతన మహాసభ నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్, ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు పి.మురళీధర్. సీపీఐ సీనియర్ నాయకులు ఎమ్.రాజేశ్వరయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి సోమన్న, ఏఐటియుసి రాష్ట్ర నాయకులు ఎం.రమేష్ బాబు, సిపిఐ సీనియర్ నాయకులు సంజీవులు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా



మహాసభలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగ నాయుడు మాట్లాడుతూ సీపీఐ స్థాపనకు శతాబ్దం పూర్తి కావడానికి అతి తక్కువ కాలమే మిగిలిందని, 1925 డిసెంబరు 26న స్థాపితమైన భారత కమ్యూనిస్టు పార్టీ బడుగు, బలహీన, కార్మిక, రైతు వర్గాల హక్కుల కోసం నిరంతర పోరాటం నిర్వహిస్తూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా సమాజాన్ని సమానత్వ మార్గంలో నడిపేందుకు సీపీఐ అహర్నిశలు శ్రమించిందన్నారు. రైతాంగ సాయుధ పోరాటం నుంచి మొద లుకొని, నేటి వరకూ సీపీఐ భూస్వామ్య వ్యతిరేక పోరాటాల్లో ముందుంటూ పేదలకు ఇంటి స్థలాలు, సాగు భూముల కోసం ఉద్యమించిందన్నారు. పూర్వ సీపీఐ ప్రధాన కార్యదర్శి అమరజీవి కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు పిలుపుతో దేశవ్యాప్తంగా జరిగి న భూ పోరాటాల్లో అనేక విజయాలు సాధించామ న్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వము కార్మికుల వ్యతిరేక చట్టాలను తెస్తూ బడా పారిశ్రామికవేత్తలను వూడిగం చేస్తూ అంబానీ అదానిలకు దాసోహం చేస్తున్నదన్నారు. రాష్ట్ర కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తోందని ప్రజలకు ఇచ్చిన హామీలను తూతూ మంత్రంగా అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ తీరు ను మార్చకపోతే సీపీఐ ఉద్యమాలను అంచలంచలుగా ముమ్మరం చేస్తుందని కులం లేని, మతం లేని, ఆర్థిక సమానత్వం కలిగిన సమ సమాజం కోసం సీపీఐ కొనసాగుతోందన్నారు.అధికారం లేనప్పటికీ, ప్రజల పక్షాన ఉండే ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు శ్రీనివాసులు, గురుమూర్తి, దస్తగిరి, చెంచు లచ్చుమ్మ, లక్ష్మీదేవి, రాజేశ్వరయ్య, రామేశ్వరయ్య, ఎస్కే రజియా, శివమ్మ, పార్వతమ్మ, ఎస్.కె మల్లిక, వెంకట లచ్చుమ్మ, మారెడ్డి మహానంది, ఎం శివమ్మ, దాదాపు వందలాది మంది పాల్గొన్నారు. అనంతరం సీపీఐ మహానంది మండల సమితి కార్యదర్శిగా ఆర్.సామ్యేలు సహాయ కార్యదర్శులుగా ఎం.రామేశ్వరయ్య. శ్రీనివాసులుతో పాటు 11 మంది ఏకగ్రీవంగా మండల సమితిని ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.

# యూరియా నిల్వల తనిఖీ



**మహానంది, జూలై 9(మనం న్యూస్):** మహానంది మండలంలోని తిమ్మాపురం సహకార సొసైటీ ద్వారా రైతులకు యూరియా పంపిణీని మండల వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వర్ రెడ్డి బుధవారం పరిశీలించారు. సొసైటీ గోదాంలో ఉన్న యూరియా నిల్వలను తనిఖీ చేశారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ రైతుల అవసరాల నిమిత్తం వారికి కావాల్సిన రసాయనిక ఎరువులను ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో అందజేస్తామని రైతులకు తెలియజేశారు. మార్కెట్‌లో యూరియా, ఇతర రసాయనిక ఎరువుల నిల్వలు ఉన్నాయని రైతులు భయపడవద్దని, అపోహలు వీడాలని సూచించారు. ఏ ప్రాంతానికి ఎంత మోతాదులో రసాయనిక ఎరువుల అవసరమో దానిని బట్టి రైతులకు అన్ని సహకార సంఘాల, రైతు సేవ కేంద్రాల ద్వారా అందజేస్తామని భరోసా ఇచ్చారు. రైతు సేవ కేంద్రాల్లో పని చేసే వ్యవసాయ శాఖ సిబ్బంది బదిలీల్లో ఉన్నందున కొన్ని సమస్యలు తలెత్తయని అందువల్లనే రైతు సేవా కేంద్రాల ద్వారా రసాయనిక ఎరువుల పంపిణీ జాప్యం జరుగుతుందని రైతులకు తెలియజేశారు. ప్రైవేటు డీలర్లు కొన్ని రకాల పిలకలు కట్టే గుళికలను మరియు కొన్ని రకాల మందులను రైతులకు అంటగడుతున్నారని రైతుల పేర్కొనడంతో అనధికారిక మందులను, గుళికలను అంటు గట్టడంతో పాటు యూరియా, డీఏపీ ఇతర రసాయనిక ఎరువులు రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన సందర్భంలో రైతులు అపోహలతో బఫర్ స్టాక్( అదనపు నిల్వలు ) ఉంచుకోవద్దని కోరారు. రైతులు తమ పంట పొలాల్లో అవసరమైన మేరకే రసాయనికి ఎరువులు వినియోగించుకోవాలని వాటి పరిధి దాటి వినియోగిస్తే భూసారం తగ్గిపోవడంతో పాటు వాతావరణ కాలుష్యం, పర్యావరణ సమతుల్యం దెబ్బతినే అవకాశం ఉందని ఏవో నాగేశ్వర్ రెడ్డి రైతులకు సూచించారు. ఇక్కడ పరిష్కారం కానీ రైతుల సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. యూరియా పంపిణీలో తిమ్మాపురం సహకార సంఘ సొసైటీ సీఈవో వెంకటస్వామి, సహకార సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలు



**నంది కొట్కూర్, జూలై 9(మనం న్యూస్):** 77వ ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవ మరియు జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా నంద్యాల జిల్లా నంది కొట్కూరు శాఖ ఆధ్వర్యంలో స్థానిక బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కాలేజ్, విజ్ఞాన్ జూనియర్ కాలేజ్‌లో సెమినార్స్ నిర్వహించుకోవ డం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య వ్యక్తులుగా పూర్వ కార్యకర్త నగేష్, వెంకటేష్ లు, పాల్గొనడం జరిగినది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత 76 ఏండ్ల నుండి విద్యార్థుల పక్షాన నిలబడి పని చేసేటువంటి సంస్థ ఏదైనా ఉంది అంటే అది అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అని అలానే విద్యార్థుల కొరకు ఎప్పటికప్పుడు నూతన ఆలోచనలు చేసి కార్యక్రమాలు నిర్వహించి ఎల్లప్పుడూ విద్యార్థుల పక్షాన ఉండే సంస్థ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఎందరో తృణప్రాయంగా వారి ప్రాణాలు ఏబీవిపి కోసం అర్పించడం జరిగింది, ఇంతటి గొప్ప సంస్థ భారతీయ విద్యార్థి పరిషత్ అని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాను ప్రకాష్, జిల్లా కన్వీనర్ యుగంధర్, బాగ్ కన్వీనర్ రేవంత్ సిటీ సెక్రెటరీ తారక్, పరమేష్, మంజునాథ్, శ్రీరామ్, మాలిక్, పాల్గొనడం జరిగింది.

## వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా యేసు



**కర్నూలు, జూలై 9(మనం న్యూస్):** మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల విభాగాల రాష్ట్ర కార్యాలయం నూతన కమిటీల నిర్మాణం జరిగింది కర్నూలు జిల్లా క్రిస్టియన్ మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కాశపోగు యేసుని, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెక్రెటరీగా పేరాపోగు రాజుని నియమిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది ఈ మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి ని మాజీ కేడీసీసీ చైర్మన్ ఎస్వీ విజయ మనోహరి ని మర్యాదపూర్వకంగా శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. వారు మాట్లాడుతూ రాబోయే కాలంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు నాయకులకు భరోసా కల్పిస్తూ భవిష్యత్తులో రాజకీయాల్లో కీలక పాత్రలు పోషించే విధంగా నాయకులను బలపరుస్తామని తెలియజేస్తూ ఏ అర్ధరాత్రి అయినా ప్రజలకు నాయకులకు కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ప్రజల పక్షాన పోరాటం చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కర్నూల్ నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు కమతం పరశురామ్, ఎంప్లాయిస్ ప్రెసిడెంట్ నాగపురి సత్యరాజు, శ్రీకాంత్, తిమ్మప్ప, భాస్కర్, రమేష్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భవిష్యత్తు కోసం విద్యార్థులకు చదువు ముఖ్యం

- మత్తు మనిషి ఆరోగ్యానికి పెను విపత్తు: ఎస్సై

**తుగ్గలి, జూలై 9(మనం న్యూస్):** విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి మంచి ఫలితాలు సాధించి భవిష్యత్తులో ఉన్నతమైన శిఖరాలను అధిరోహించాలని తుగ్గలి సబ్ ఇన్స్పెక్టర్ బాల నరసింహులు అన్నారు. బుధువారం అనసూయ జూనియర్ కళాశాల, నోవీ కాన్సెప్ట్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ర్యాగింగ్, మాదక ద్రవ్యాలు, ఇవి టీజింగ్, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతో అనారోగ్యం పాలై జీవితం అంధకారమవుతుందని అన్నారు. యువత చదువుతోపాటు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని, క్రమ శిక్షణతో కూడిన చదువు వలన ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో నోవి స్కూల్ ప్రధానోపాధ్యాయుడు తిప్పయ్య,ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## అమ్మవారికి సారె సమర్పణ



**మహానంది, జూలై 9(మనం న్యూస్):** ఆశాఢ మాసం సందర్బంగా మహానంది క్షేత్రంలో వెలసిన శ్రీకామేశ్వరీ దేవి అమ్మవారికి సారె సమర్పించారు. బుధవారం మహానంది దేవస్థానం కాలనీకి చెందిన మహిళలు ప్రత్యేకంగా అమ్మవారి విగ్రహాన్ని అలంకరించి భక్తి శ్రద్ధలతో సారె చీరతో ఆలయానికి చేరుకున్నారు. వీరికి వేద పండితు లు రవిశంకర్ అవధాని, సూపర్డెంట్ శశిధర్ రెడ్డి, టెం పుల్ ఇన్‌స్పెక్టర్ మల్లయ్యలు స్వాగతం పలికారు. అనంతరం, శ్రీకామేశ్వరి దేవీ సహిత మహానందీశ్వరునికి ప్రత్యేక పూజలు చేసి సారె సమర్పించారు.

## లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి: కార్మికులు



**జూపాడు బంగ్లా, జూలై 9(మనం న్యూస్):** మన దేశంలోని పెట్టుబడి దారుల ప్రయోజనాల కోసం కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడు తెచ్చింది. వీటిని రద్దు చేయాలని కార్మికుల అందరికీ కనీస వేతనం 26,000 అమలు చేయాలని బుధవారం జూపాడు బంగ్లా మండల కేంద్రంలో అంబేద్కర్ సర్కిల్ నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి కేజీ రోడ్డుపై రాస్తారోక నిర్వహించడం జరిగినది. కార్యక్రమానికి సీఐటీయూ మండల నాయకులు ఆకుల రాము అధ్యక్షత వహించారు. అనంతరం తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఎం మండల కన్వీనర్ ఎం కర్ణ. శ్రీనివాసులు, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రసన్న, లక్ష్మీదేవి, సరస్వతమ్మ. లలితమ్మ, గురుదేవి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు హర్షవర్ధన్ మాట్లాడుతూ, బ్రిటిష్ పాలనలో ఎంతోమంది ప్రాణ త్యాగాలు చేసి కార్మిక చట్టాలను సాధించుకోవడం జరిగినదని ఆ చట్టాలను రద్దు చేస్తే సహించేది లేదన్నారు. ఒక ప్రక్క నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి వాటిని అదుపు చేయకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై విద్యుత్ స్మార్ట్ మీటర్ల పేరుతో విపరీతంగా ప్రజలపై విద్యుత్ ఛార్జీలు పెంచుతూ ప్రజలపై మోయలేని వారాలు మోపుతున్నాయన్నారు. ఎన్నికల ముందు అంగన్వాడి అక్కా చెల్లెమ్మలు 42 రోజుల పాటు సమ్మె కొనసాగిస్తున్న సందర్భంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సమ్మె శిబిరాల వద్దకు వచ్చి తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని వారు గుర్తు చేశారు. ఉపాధి హామీ జాబు కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించి రోజు వేతనం 600 ఇవ్వాలని మండలంలో ఉన్న మెట్ట ప్రాంతానికి సాగునీరు అందించాలని కౌలు రైతుల రక్షణ కు సమగ్ర చట్టం చేయాలని అన్నదాత సుఖీభవ 20000 రైతుల అకౌంట్లో జమ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ సమస్యలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలుపరిష్కారం చేయని వెడల భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని వారు హెచ్చరించారు అనంతరం తాసిల్దార్ చంద్రశేఖర్ నాయక్ గారికి వినత పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఈ సమస్యలు అన్ని ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగనవాడి వర్కర్స్ హెల్పర్సు కార్యకర్తలు. రైతు సంఘం నాయకులు పూజారి రామిరెడ్డి. జయన్న. బాబు. స్వచ్ఛభారత్ కార్మికులుఅర్జున్ రమణమ్మ. తదితరులు పాల్గొన్నారు

# కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో సుపరిపాలన

- ఎంపీ బస్తిపాటి నాగరాజు



**కర్నూలు, జూలై 9(మనం న్యూస్):** గత వైసీపీ పాలనకు కూటమి ప్రభుత్వం పాలన కు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు.. ఆలూరు నియోజక వర్గంలోని హొళగుంద మండల కేంద్రంలో నిర్వహించిన సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి తో కలిసి ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎంపీ నాగరాజు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు వివరించారు. అంతకు ముందు ఎస్పి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేసి చూపించిందన్నారు. ఇక ఈ నాలుగేళ్లలో ఆలూరులో వేదవతి ప్రాజెక్టును నిర్మించడంతో పాటు కర్నూలు టూ బళ్ళారి జాతీయ రహదారిని నిర్మిస్తామన్నారు. ఇక రాష్ట్రం కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుందన్న ఎంపీ, సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలూరు పరిశీలకులు ఆర్టీసీ చైర్మన్ పూల నాగరాజు, అనంతపురం జిల్లా టిడిపి అధ్యక్షుడు వెంకట శివుడు, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ళ బొజ్జమ్మ, హొళగుంద మండల అధ్యక్షుడు తిప్పయ్య, మాజీ అధ్యక్షుడు శేషగిరి, మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తులకు మెరుగైన సౌకర్యాలు



**మహానంది, జూలై 9(మనం న్యూస్):** మహానంది క్షేత్రానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఏఈఓ మధు తెలిపారు. బుధవారం తిరుమల తిరుపతి వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈఓ శ్రీనివాస రెడ్డి ఆదేశాల మేరకు క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వసతి గృహాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సిబ్బందికి సూచనలు జారిచేసామన్నారు. ఆయన వెంట సూపర్డెంట్ సుబ్బారెడ్డి వున్నారు.

# లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు పోరాటం

**పత్తికొండ, జూలై 9(మనం న్యూస్):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ కోడ్లను రద్దు చేసేంతవరకు పోరాటం కొనసాగుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. రామచంద్రయ్య అన్నారు. బుధవారం దేశ వ్యాప్తంగా 22వ సార్వత్రిక సమ్మె భాగంగా పత్తికొండ పట్టణంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ నుండి సిఐటియు, ఏఐటియుసి, ట్రేడ్ యూనియన్, ప్రజా సంఘాలు నాయకులు, కార్యకర్తలు లేబర్ కోడ్లు రద్దు చేయాలంటూ నినాదంతో నాలుగు స్తంభాల మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం, సిఐటియు మండల కార్యదర్శి గోపాల్, ఎఐటియుసి రంగన్న అధ్యక్షతన బహిరంగ సభలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి రామచంద్రయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ కార్మికులను, ప్రజానీకాన్ని మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తే సహించేది లేదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల కోసం తీసుకొచ్చిన నూతన 4 లేబర్ కోడ్లను రద్దుచేసి పోరాడి సాధించుకున్న 44 లేబర్ కోడ్లు ను కొనసాగించేంతవరకు పోరాటం చేస్తామని అన్నారు. 8 గంటల పని విధానం కోసం బదులుగా 10 గంటలు పెంచడం దుర్మార్గం చర్య అన్నారు. అంగన్వాడి టీచర్లకు కనీస వేతనం ,ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు గిట్టుబాటు ధర రావాలంటే స్వామినాథ మిషన్ సిఫారసును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలను మోసం చేస్తే ప్రభుత్వాలకు పుట్టగతులు ఉండవని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్మిక హక్కులను రద్దు చేయకపోతే రాబోయే రోజుల్లో కార్మికులు, కర్షకులు, రైతులు, ప్రజా సంఘాలు, ట్రేడ్ యూనియన్లు కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి రాజా సాహెబ్, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి ఎన్ కృష్ణ, సీపీఎం మండల కమిటీ సభ్యులు దస్తగిరి, రంగారెడ్డి, గంగన్న, సిఐటియు నాయకులు ఎం .రవిచంద్ర, ప్రభాకర్, రామాంజనేయులు, హమాలి నాయకులు రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నరసన్న, బురుజులు, సిఐటియు అనుబంధ సంఘం భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు దుర్గా, భూమా, నాగేంద్ర, మంజు, డివైఎఫ్ఐ నాయకులు దుగ్గెన్న, అలిపిర, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు మోహన్, వలి, ఐకెపి రామాంజనేయులు, ఏఐటియుసి మండల కమిటీ సభ్యులు నెత్తికంటయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు,ఆశా వర్కర్లు పావని, స్వాతి, అంగన్వాడి వర్కర్స్ నాయకులు అశ్వర్థమమ్మ, సోమేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.





## ఫేస్ యాప్‌లను రద్దు చేయాలి: సీఐటీయూ



**మహానంది, జూలై 9(మనం న్యూస్):** అంగన్వాడీ టీచర్లకు ఫేస్ యాప్ లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు నాయకులు, వీఓఏల జిల్లా అధ్యక్షులు కొమ్ముదాసరి సోమన్న డిమాండ్ చేశారు. బుధవారం నంద్యాల జిల్లా, మహానంది మండలం లోని అంగన్వాడీ, విఓఏలు, ఆశావర్కర్లు మహానంది లో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 21వ జిఓను రద్దు చేయాలన్నారు. ప్రధానంగా పేస్ యాప్‌లను రద్దు చేయాలని కోరారు. పేస్ యాప్‌ల ద్వారా అంగన్వాడీ వర్కర్లు మానసికంగా కృంగి పోతున్నారన్నారు. మహానంది గిరిజన కాలనీకి చెందిన అంగన్వాడీ వర్కర్ పాతిమా మేరీ రాణి బ్రెయిన్ స్టోక్‌కు గురైందన్నారు. నాలుగు లేబర్ కోర్టులను రద్దు చేయాలన్నారు. ప్రస్తుతం నిత్యావసర సరుకుల ధరలు మండిపడుతున్నాయని రూ.26 వేల వేతనం ఏర్పాటు చేయాలన్నారు. కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు సావిత్రి, నారాయనమ్మ, కైరున్, జ్యోతి, కళావతి, నయోమి, పుష్పకల, గౌరీ, లక్ష్మీ ప్రసన్న, చంద్రలీల, విజయ భారతి, రాజమ్మ, సుమిత్ర, మాబ్బాష, తదితరులు పాల్గొన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం, విధుల్లో పని ఒత్తిడి వల్ల అనారోగ్యానికి గురైన మహానంది అంగన్ వ్వాడీ టీచర్ ఫాతిమా మేరీ రాణీని పరామర్శించారు.

# హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు అరెస్

### ఎస్ఆర్‌హెచ్-హెచ్‌సీఏ మధ్య టికెట్ల వివాదం

### మ్యాచ్ టికెట్లు కేటాయించలేదంటూ కార్పొరేట్ బాక్సుకు హెచ్‌సీఏ తాళం

### ఈ ఘటనతో ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం హైదరాబాద్‌ను వీడిపోతామని హెచ్చరిక

### ఘటనపై విచారణ.. చర్యలు చేపటిన సీఐడీ

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు అరెస్ట్ అయ్యారు. సన్‌రైజర్స్ హైదరాబాద్, హె చ్‌సీఏ వ్యవహారంలో సీఐడీ చర్యలు చేపట్టింది. జగన్‌మోహన్ రావుతో పాటు మరో వ్యక్తిని సీఐడీ అరెస్టు చేసింది. ఐపీఎల్ టికెట్ల వ్యవహారంలో వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టిన సీఐడీ అధికారులు.. తాజాగా ఇద్దరిని అరెస్ట్ చేశారు. విజిలెన్స్ నివేదిక ఆధారంగా ఇటీవల కేసు సీఐడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. గత ఐపీఎల్ సీజన్‌లో ఎస్ఆర్‌హెచ్-హెచ్‌సీఏ మధ్య టికెట్ల వివాదం చెలరేగింది. మ్యాచ్ టికెట్లు కేటాయించలేదంటూ కార్పొరేట్ బాక్సుకు హెచ్‌సీఏ తాళం వేసింది. ఈ ఘటనతో ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం హైదరాబాద్‌ను వీడిపోతామని హెచ్చరించింది. అధ్యక్షుడు జగన్‌మోహన్ రావుపై ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం తీవ్ర ఆరోపణలే చేసింది. ఘటనపై గతంలో ప్రభుత్వం విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఎస్ఆర్‌హెచ్ ఫ్రాంచైజీపై హెచ్‌సీఏ అధ్యక్షుడు ఒత్తిడి తీసుకువచ్చినట్లుగా విజిలెన్స్ విచారణలో తేలింది. టికెట్ల కోసం ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యాన్ని ఇబ్బందులకు గురి చేశారని నిర్ధారణ అయ్యింది. వాస్తవానికి ఉచిత పాస్ల కోసం హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు తీవ్రంగా వేధిస్తున్నాడని సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్ ఆరోపించింది. ఇలాగే చేస్తే తాము హైదరాబాద్ నుంచి వెళ్లిపోతామని హెచ్చరించింది. ఉచిత పాస్‌ల కోసం హెచ్‌సీఏ అధికారులు, అధ్యక్షుడి నుంచి వేధింపులు తీవ్రమయ్యాయని.. ఇలాంటి ప్రవర్తనను సహించమని స్పష్టం చేసింది. ఇలాగే కొనసాగితే తాము వేదికను మార్చుకునేందుకు వెనుకాడబోమని.. ఉప్పల్ స్టేడియాన్ని హోం గ్రౌండ్‌గా ఎంచుకుని మ్యాచ్‌లు ఆడటం వారికి ఇష్టం లేనట్లుగా ఉందంటూ హెచ్‌సీఏ కోశాధికారికి లేఖ సైతం రాసింది. లిఖితపూర్వకంగా చెబితే హైదరాబాద్ నుంచి వెళ్లిపోతామని.. ఈ విషయంపై బీసీసీఐకి, తెలంగాణ ప్రభుత్వం, జట్టు యాజమాన్యానికి తెలుపనున్నట్లు చెప్పింది. గత 12 సంవత్సరాలుగా హెచ్‌సీఏతో కలిసి పని చేస్తున్నామని.. గత సీజన్ నుంచి మాత్రమే ఈ సమస్యలు, వేధింపులు ఎదుర్కొంటున్నట్లుగా పేర్కొంది. ప్రతి సీజన్‌లో 50 కాంప్లిమెంటరీ టికెట్లు (ఎఫ్12ఏ బాక్స్) ఇస్తున్నామని.. ఈ ఏడాది వారు అదనంగా మరో 20 టికెట్లు అడుగుతున్నారని ఆరోపించింది. ఎస్ఆర్‌హెచ్, హెచ్‌సీఏ వివాదం తీవ్రస్థాయికి చేరడంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే.



# గిల్.. లార్డ్స్ లోనూ జిగేల్ అంటే..!




రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ.. టీమ్‌ఇండియా, ఇంగ్లాండ్ సిరీస్ కు ముందు సుదీర్ఘ ఫార్మాట్ కు తమ రిటైర్మెంట్ ను ప్రకటించారు. దీంతో శుభ్ మన్ గిల్.. టీమ్‌ఇండియా టెస్ట్ పగ్గాలు అందుకున్నాడు. కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత గిల్ అద్భుతంగా రాణిస్తున్నాడు. లీడ్స్ లోని హెడింగ్లీ వేదికగా జరిగిన మొదటి మ్యాచ్ లోనే సెంచరీతో ఆకట్టుకున్నాడు. తొలి ఇన్నింగ్స్ లో 147, రెండో ఇన్నింగ్స్ లో 8 రన్స్ చేశాడు. ఇక బర్మింగ్ హామ్ లోని ఎడ్జ్ బాస్టన్ లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. మొదటి ఇన్నింగ్స్ లో ఏకంగా డబుల్ సెంచరీతో విరుచుకుపడ్డాడు. క్రీజులో ఎంతో ఓపికగా బంతులను ఎదుర్కొన్నాడు. 387 బాల్స్ లో 269 పరుగులు చేశాడు. రెండో ఇన్నింగ్స్ లో పరిస్థితులకు అనుగుణంగా చాలా వేగంగా పరుగులు రాబట్టాడు. 162 బంతులు ఎదుర్కొని 161 రన్స్ చేశాడు. 148 ఏళ్ల టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇలా ఒక మ్యాచ్ లో సెంచరీతోపాటు, 150కి పైగా స్కోర్ చేసిన ఏకైక బ్యాటర్ గానూ నిలిచాడు. అలాగే ఒకే మ్యాచ్ లో అత్యధిక పరుగులు చేసిన తొలి భారత బ్యాటర్ గానూ రికార్డు సృష్టించాడు. గిల్ ఈ మ్యాచ్ లో మొత్తం 430 పరుగులు చేశాడు. ఇలా అతడు మొత్తంగా ఇప్పటి వరకు రెండు మ్యాచుల్లో ఏకంగా 585 పరుగులు సాధించాడు.

**వారి సరసన నిలవాలంటే..**

జులై 10 నుంచి లార్డ్స్ వేదికగా ఇంగ్లాండ్ తో టీమ్‌ఇండియా తలపడనుంది. భారత్ తరఫున ఈ వేదికలో సెంచరీ చేసిన తొలి బ్యాటర్ వినోద్ మన్కడ్. జూన్ 19, 1952లో అతడు 184 పరుగులు చేశాడు. తర్వాత దిలీప్ వెంగ్ సర్కార్ 1979, 1982, 1986లో మూడు సార్లు ఈ వేదికగా సెంచరీలు చేశాడు. ఇలా లార్డ్స్ లో ఒకటి కంటే ఎక్కువ శతకాలు బాదిన ఏకైక టీమ్‌ఇండియా బ్యాటర్ గా నిలిచాడు. గుండప్ప విశ్వనాథ్ 1979లో 337 బంతుల్లో 113 పరుగులు, రవిశాస్త్రి జులై 26, 1990న 184 బంతుల్లో 100, మహ్మద్ అజారుద్దీన్ జులై 26, 1990న 111 బంతుల్లో 121, సౌరభ్ గంగూలీ జూన్ 20, 1996న 301 బంతులు ఎదుర్కొని 131 పరుగులు చేశాడు. అయితే దాదాకు అదే తొలి అంతర్జాతీయ మ్యాచ్ కావడం విశేషం. అజిత్ అగార్కర్ తన కెరీర్ లో ఒకే ఒక సెంచరీ సాధించాడు. అది కూడా లార్డ్స్ వేదికగానే 2002లో 190 బంతులు ఎదుర్కొని 109 పరుగులు చేశాడు. ది గ్రేట్ వాల్ ఆఫ్ ఇండియాగా పేరున్న రాహుల్ ద్రవిడ్ జులై 21, 2011న 220 బంతులు ఎదుర్కొని 103 పరుగులు, అజింక్య రహానే జులై 17, 2014న 154 బంతుల్లో 103, ఆగస్టు 12, 2021లో కేఎల్ రాహుల్ 250 బంతుల్లో 129 పరుగులు చేశాడు. ప్రస్తుతం భీకరమైన ఫామ్ లో ఉన్న శుభ్ మన్ గిల్.. క్రికెట్ కు పుట్టినిల్లుగా పేరున్న లార్డ్స్ లోనూ సెంచరీ కొడితే.. ఇక్కడ ఈ ఫీట్ సాధించిన 11వ భారత బ్యాటర్ గా నిలుస్తాడు.

**వీరికి సాధ్యం కానిది..**

అలాగే.. భారత టెస్ట్ క్రికెట్ లో మహామహులుగా పేరున్న సునీల్ గావస్కర్, సచిన్ తెందుల్కర్, వీవీఎస్ లక్ష్మణ్, వీరేంద్ర సెహ్వాగ్, ఎంఎస్ ధోనీ, రోహిత్ శర్మ కూడా లార్డ్స్ లో సెంచరీ చేయలేకపోయారు. ఈ భారత దిగ్గజాలకు దక్కని గౌరవాన్ని అందుకునే అద్భుత అవకాశం ప్రస్తుతం 'ప్రిన్స్' ముందు ఉంది! ఈ నేపథ్యంలో ఎడ్జ్ బాస్టన్ లో బ్యాట్ తో వీరవిహారం చేసిన శుభ్ మన్ గిల్.. లార్డ్స్ లోనూ సెంచరీ సాధించి చరిత్ర సృష్టించాలని భారత అభిమానులు కోరుకుంటున్నారు.

## జింబాబ్వే వైట్వాష్

రెండు టెస్టుల సిరీస్ లో దక్షిణాఫ్రికా 2-0తో ఆతిథ్య జింబాబ్వేను వైట్ వాష్ చేసింది. ఆఖరి టెస్టులో సఫారీ జట్టు ఇన్నింగ్స్ 236 పరుగుల భారీ తేడాతో గెలిచింది. ఫాలోఆన్ ఆడుతూ మూడో రోజు, మంగళవారం 51/1తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే.. 220 పరుగులకే ఆలౌటైంది. నిక్ వెల్ (55), కెప్టెన్ ఇర్విన్ (49), కైటానో (40), మాత్రమే పోరాడారు. కార్బిన్ బాష్ (4/38), సెనురన్ ముత్తుస్వామి (3/77), కొడి యూసుఫ్ (2/38) ప్రత్యర్థి పతనాన్ని శాసించారు. తొలి ఇన్నింగ్సు్లో దక్షిణాఫ్రికా 626/5 వద్ద డిక్లేర్ చేసింది. జింబాబ్వే 170 పరుగులకే ఆలౌటైంది. ముల్డర్ కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు లభించాయి. రెండో టెస్టులో ట్రిపుల్ సెంచరీ చేసిన ముల్డర్.. మొత్తంగా సిరీస్ లో 531 పరుగులు సాధించాడు. 7 వికెట్లు కూడా తీశాడు.

టీమ్ ఇండియా కెప్టెన్ శుభ్ మన్ గిల్ టెస్టు ర్యాంకింగ్స్ లో టాప్-10లోకి దూసుకొచ్చాడు. ఏకంగా 15 స్థానాలు ఎగబాకి 6వ స్థానంలో నిలిచాడు. ఇంగ్లాండ్ తో జరిగిన రెండో టెస్టు గిల్ డబుల్ సెంచరీ (269), సెంచరీ (161)తో విరుచుపడ్డ సంగతి తెలిసిందే. మరోవైపు, జో రూట్ (868)ని వెనక్కినెట్టి

## 15 స్థానాలు ఎగబాకి టాప్-10లోకి శుభ్‌మన్ గిల్

ఇంగ్లాండ్కే చెందిన హ్యారీ బ్రూక్ (886) కొత్త నంబర్ బ్యాటర్ గా అవతరించాడు. యశస్వి జైస్వాల్ నాలుగో స్థానంలో కొనసాగుతుండగా.. రిషభ్ పంత్ ఒక స్థానం కిందకు వెళ్లి ఏడో ప్లేస్ లో ఉన్నాడు. భారత్ తో జరిగిన రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్ లో భారీ శతకం (184) బాదిన ఇంగ్లాండ్ వికెట్ కీపర్ జేమీ స్మిత్ 16 స్థానాలు ఎగబాకి 10వ స్థానానికి దూసుకొచ్చాడు. ఇంగ్లాండ్, భారత్ మధ్య జులై 10 నుంచి లార్డ్స్ వేదికగా మూడో టెస్టు ప్రారంభంకానున్న సంగతి తెలిసిందే.

## 'బ్యాడాస్'గా కొత్త లుక్‌తో మాస్ వెర్షన్

మన టాలీవుడ్ స్టార్ బాయ్ సిద్ధూ జొన్నలగడ్డ హీరోగా చేసిన అన్ని సినిమాల్లో బాగా గుర్తుండిపోయిన సినిమా పేరు 'డీజే టిల్లు'. ఒక బాహుబలి, పుష్ప లాంటి ఐకానిక్ పాత్రల్లా టిల్లు గాడు కూడా ఒక బ్రాండ్ ని సెట్ చేసుకున్నాడు. ఇప్పుడు వరకు మంచి కామికల్ యాంగిల్ ఇంకా రొమాంటిక్ పాత్రలు చేసిన యంగ్ హీరో ఇప్పుడు మాస్ అవతార్ లోకి మారాడు. తన టిల్లు ప్రొడ్యూసర్స్ తో కలిసి 'బ్యాడాస్' అనే సాలిడ్ ప్రాజెక్ట్ ని ఇపుడు అనౌన్స్ చేశారు. తనపై ఒక మాస్ లుక్ ని మేకర్స్ రివీల్ చేయగా ఈ పోస్టర్ లో సిద్ధూ మంచి డైనమిక్ గా కనిపిస్తున్నాడు. మీడియా ముందు స్టైలిష్ గా సిగరెట్ కలుస్తూ తన మార్క్ యాటిట్యూడ్ ని చూపిస్తున్నాడు.




## అనుపమ చిత్రానికి 96 కట్స్ అవసరం లేదు..!

కేంద్రమంత్రి, నటుడు సురేశ్ గోపి, నటి అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ'. ఈ చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వడంపై ఇంతకాలం అభ్యంతరం వ్యక్తం చేసిన బోర్డ్ ఇప్పుడు వెనక్కి తగ్గింది. ముందు చెప్పిన విధంగా 96 కట్స్ వద్దని కేవలం రెండే మార్పులు చేయమని కోరింది. ఈ మేరకు సెన్సార్ బోర్డ్ తరఫు న్యాయవాది కేరళ హైకోర్టులో తన వాదన వినిపించారు. సినిమా టైటిల్ విషయంలో చిన్న మార్పు చేయమని కోరారు. 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' అని కాకుండా ఇందులో హీరోయిన్ పేరుకు అద్దం పట్టేలా 'వి జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' లేదా 'జానకి వి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ'గా టైటిల్ మార్చమని తెలిపారు. సినిమాలోని ఓ కోర్టు సన్నివేశంలో హీరోయిన్ పేరును మ్యూట్ చేయమని కోరారు. అలా కాని పక్షంలో ఇదే తరహా సన్నివేశాలు భవిష్యత్తులో వచ్చే అవకాశం ఉందని.. కొన్ని మతాలవారి సెంటిమెంట్స్ కు అది ఇబ్బంది కలిగించవచ్చని వివరించారు. బోర్డు తరఫు న్యాయవాది వాదనలు విన్న న్యాయస్థానం దీనిపై ఒక నిర్ణయానికి రావాలని, తమ అభిప్రాయాన్ని తెలియజేయాలని చిత్రబృందాన్ని ఆదేశించింది.

**అసలు వివాదం ఏమిటంటే..:** థ్రిల్లర్ కథాంశంతో 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' చిత్రాన్ని ప్రవీణ్ నారాయణన్ రూపొందించారు. సత్యం ఎప్పటికైనా విజయం సాధిస్తుందనేది ఉప శీర్షిక. ఇందులో జానకిగా అనుపమ కనిపించనున్నారు. లాయర్ గా ప్రముఖ నటుడు సురేశ్ గోపి నటించారు. కోర్ట్ రూమ్ డ్రామా మూవీ విషయంలో సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసింది. సీతాదేవి మరో పేరు జానకి కావడం, సినిమాలో లైంగిక దాడికి గురైన మహిళ పాత్రకు ఆ పేరు పెట్టడం సమంజసం కాదని సెన్సార్ బోర్డు చిత్ర బృందానికి తెలిపింది. సినిమా పేరు మార్చాలని కోరింది. అంతేకాకుండా, పలు కట్స్ సూచించింది. సెన్సార్ నిర్ణయంపై టీమ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. జానకి అనే పేరు మారిస్తే.. సినిమాలో చాలామార్పులు చేయాల్సి ఉంటుందని అది వీలుపడదని తెలిపింది. ఈ క్రమంలోనే సెన్సార్ జాప్యాన్ని వ్యతిరేకిస్తూ నిర్మాతలు కోర్టును ఆశ్రయించారు.



## అదొక టాక్సిక్ రిలేషన్ షిప్‌లా ఫీలయ్యా : సమంత



మానసిక, శారీరక ఆరోగ్యానికి సంబంధించిన పలు అంశాలపై 'టేక్ 20 హెల్త్' వేదికగా అవగాహన కల్పిస్తున్నారు నటి సమంత. ఆయా రంగాలకు చెందిన నిపుణులను ఇంటర్వ్యూ చేయడమే కాకుండా తన జీవితానికి సంబంధించిన పలు అంశాలనూ అందులో పంచుకుంటున్నారు. ఈక్రమంలోనే కొన్నిరోజుల క్రితం 'బయోహ్యాకింగ్'పై జరిగిన చిట్చాట్లో సమంత ఆసక్తికర విషయాన్ని బయటపెట్టారు. ఒకానొక సమయంలో మొబైల్‌కు తాను ఎంతగా ఎడిక్ట్ అయ్యారో చెప్పారు. ఫోన్ లేకుండా తాను ఉండలేకపోయేదానినని తెలిపారు. అదొక టాక్సిక్ రిలేషన్ షిప్‌లా ఫీలయ్యానన్నారు. ఆ అలవాటును తాను ఏవిధంగా అధిగమించారో వెల్లడించారు.

''వ్యక్తిగత జీవితానికి సంబంధించి నేను ఎన్నో మార్పులు చేసుకున్నాను. నాకంటూ ఒక ప్రత్యేకమైన రొటీన్ ఏర్పాటుచేసుకుని.. దానిని ఫాలో అవుతున్నా. అందుకు సంతోషంగా ఉన్నా. ఫోన్ విషయంలో మాత్రం తొలుత నన్ను నేను కంట్రోల్ చేసుకోలేకపోయా. ఫోన్ వాడకానికి బాగా అలవాటు పడ్డా. ఒకానొక సమయంలో ఇది కరెక్టేనా అని నన్ను నేను ప్రశ్నించుకున్నా. ఆ అలవాటు నుంచి బయటపడేందుకు డిజిటల్ డిటాక్స్ ఫాలో అయ్యా. ఎవరితోనూ మాట్లాడకుండా, ఫోన్ చూడకుండా, ఇతరులను కలవకుండా.. ఇలా సుమారు మూడు రోజుల పాటు ఉండాలని నిర్ణయించుకున్నా. అలా కొన్ని రోజుల పాటు పాటించిన తర్వాత ఎంతో మారా'' అని సమంత తెలిపారు. సమంత ప్రస్తుతం నటిగానే కాకుండా నిర్మాత, వ్యాపారవేత్తగా రాణిస్తున్నారు. 'సాకి' దుస్తుల బ్రాండ్‌తో పాటు సీక్రెట్ ఆల్కెమిస్ట్ అనే బ్యూటీ, కాస్మొటిక్స్, పర్సనల్ కేర్ సంస్థ సహ వ్యవస్థాపకురాలిగా వ్యవహరిస్తున్నారు.



## బాహుబలి వస్తున్నాడు..

ఒక్క తెలుగు సినిమా స్థాయినే కాకుండా మొత్తం భారతీయ సినిమా రూపు రేఖలనే మార్చేసిన సినిమా ఏదన్నా ఉంది అంటే అది పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన ''బాహుబలి'' సినిమానే అని చెప్పాలి. దర్శకుడు ఎస్ ఎస్ రాజమౌళి తెరకెక్కించిన ఈ ఎపిక్ చిత్రం ఒక గేమ్ ఛేంజర్ గా నిలిచింది. అయితే ఈ సినిమా రీరిలీజ్ కోసం ఎప్పుడు నుంచో అభిమానులు ఎదురు చూస్తుండగా ఆ మధ్య నిర్మాత శోభు యార్లగడ్డ బాహుబలి రీరిలీజ్ ఈ ఏడాది అక్టోబర్ లో ఉంటుంది అని కన్ఫర్మ్ చేశారు. ఇక రేపు జూలై 10తో బాహుబలి సినిమా వచ్చి పదేళ్లు పూర్తవుతుంది. దీనితో చిత్ర యూనిట్ ఇప్పుడే మంచి హింట్స్ రీరిలీజ్ పై ఇస్తున్నారు. అయితే దీనిపై క్లారిటీ రేపే వస్తున్నట్టుగా వినిపిస్తుంది. బాహుబలి వస్తున్నాడు అంటూ నేటి నుంచే అలర్ట్ చేస్తుండగా ఫైనల్ గా సినిమా మళ్ళీ రికార్డు వసూళ్లు నమోదు చేయడం గ్యారెంటీ అని చెప్పవచ్చు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.